MAHILA SADHIKARATHA

# మహిళా సాధికారత

స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాస పత్రిక

mas

సంపుటి : 23 సంచిక: 12 రంగారెడ్డి ఆగస్ట్ 2025 పేజీలు : 36 వెల : రూ. 10/-

## మళ్ళీ వచ్చేసింది !

ఏపిమాస్ ఆధ్వర్యంలో
ఉత్తమోత్తమ ఎస్ హెచ్ జి
సమాఖ్యలను సన్మానించే

## జాతీయ స్థాయి సంరంభం!

ఆన్‌లైన్ దరఖాస్తులకు ఆఖరు తేదీ
2025 ఆగస్ట్ 20

వివరాలు. 5వ పేజీలో




ఏపిమాస్ ల 24 వ వార్షికోత్సవ సమావేశంలో ప్రసంగిస్తున్న శ్రీ సి ఎస్ రెడ్డి




25 ఏపిమాస్ రజతోత్సవ సంవత్సరం!




సైబర్ మోసాల పై
ప్రత్యేక కథనం
లోపలి
పేజీలలో....

## ఇక స్వర్ణ ప్రస్థానం !

24 ఏళ్ళుగా ...
పటిష్ఠంగా, సగర్వంగా సదా సత్ఫలితాలకు
పూచీగా, స్వచ్ఛంద సేవారంగంలో నిత్య నూతనంగా,
నాటి చిన్నిమొక్క నేటి మహావృక్షంగా,
సుస్థిరాభివృద్ధి పథంలో ఎప్పటికీ ముందడుగుగా,
అంకితభావానికి చిరునామాగా,
వెలుగులు విరజిమ్ముతోంది ... ఏపిమాస్ !
అన్నిటా తన ప్రత్యేకతను కొనసాగిస్తూ,
రజతోత్సవ తారగా ప్రకాశిస్తూ,

(మిగతా 17వ పేజీలో)

## చిగురించిన ఆశ!

ఆకాశం మౌనముద్రదాల్చింది.
నేలతల్లి కడుపు ఎండిపోయింది,
రోజులు గడుస్తున్నాయ్... ఆశ క్షీణిస్తోంది,
రైతుల ముఖాలలో నిస్తేజం, నిర్వేదం, తలెత్తి నిం
గిని చూస్తే తన్నుకొచ్చే దుఃఖం ...
చిత్రం.. అది గుర్తుకురాని గతమైంది!
మరింత చిత్రంగా నేడు చిత్తరువే మారిపోయింది!
ఎంత కమనీయం, ఆ నల్లటి మబ్బుల దృశ్యం!
ఎంత మనోహరం ఆ మేఘ మంజుల గానం!!

(మిగతా 17వ పేజీలో)

NABARD
నాబార్డ్ సౌజన్యంతో ....


# భూమి, నీటి సంరక్షణ మరియు యాజమాన్యం

భూమిలో సారం ... మొలకకు ఆధారం

కీలక దశలో అందే నీరే పెరిగే పంటకు జీవం

## చేపట్టే పనులు

### నీటి సంరక్షణ - యాజమాన్యం




### భూసార, నీటి సంరక్షణ

NABARD

# మహిళా సాధికారత

సంపుటి 23 సంచిక 12




సంపాదకీయం

## అభినందనలు !

**ఒ**క మంచి పని చేస్తే అభినందించడం, తగని పనిచేస్తే యిది తప్పని చెప్పి , మంచిదారిలోకి మళ్ళించే ప్రయత్నంచేయడం మరిన్ని సత్కార్యాలకు మూలమవుతుంది, సమాజ అభ్యున్నతికి దోహదం చేస్తుంది. కాని, నిక్కచ్చిగా యిది సరైనపని కాదని చెబితే, ఆ సద్విమర్శను సద్భావనతో స్వీకరించే వారెందరుంటారు? తాము చెప్పేదే,చేసేదే ముమ్మాటికీ సరైందని సమర్ధించుకునే వారు, ఎదురుదాడికి దిగేవారు ఎక్కువవుతున్న కాలమిది. అందుకే, సాహసించి, తలదూర్చి , తప్పును ఎత్తి చూపలేకపోయినా, సాధ్యమైనంతగా ఒప్పను మెచ్చుకోవడం, వెన్నుదట్టి ప్రోత్సహించడం, కనీసం వారైనా ఆ అభ్యుదయ పథంలో కొనసాగడానికి, వారికి లభించిన ప్రశంసలు చూసి ఏ కొద్దిమందైనా మంచిబాట పట్టడానికి ప్రోద్బలంగా నిలుస్తుంది. ఈ సదాలోచనతోనే, ఈ సత్సంకల్పంతోనే దేశవ్యాప్తంగా ఉత్తమ పనితీరు కనబరచే స్వయంసహాయ సమాఖ్యలను గుర్తించి, సన్మానించి, పురస్కారాలను అందించి, అభినందించే బృహత్తర కార్యక్రమాన్ని ఏపిమాస్ తలకెత్తుకున్నది. ఎన్ని ఆటంకాలు ఎదురైనా, ఆరంభించిన సత్కార్యాన్ని అర్ధంతరంగా వదిలిపెట్టకుండా, చిత్తశుద్ధితో, వరుసగా గత నాలుగేళ్ళుగా, ప్రామాణికంగా నిర్వహించడమే కాకుండా, ఐదవ పర్యాయం కూడా సమధికోత్సాహంతో జాతీయ స్థాయిలో అభినందన చందనాలందించడానికి, పురస్కార సత్కారం సాగించడానికి ఏపిమాస్ సర్వసన్నద్ధంగా వున్నది. ఈ సదవకాశాన్ని ఎన్ని ఎక్కువ సమాఖ్యలు సద్వినియోగం చేసుకుంటే, ఏపిమాస్ సంకల్పించిన సదాశయం అంత సంపూర్ణంగా నెరవేరినట్టవుతుంది. అందుకే అర్హమైన సమాఖ్యలన్నింటికీ సాదర స్వాగతం పలుకుతోంది ఏపిమాస్!

ఇలాంటి అభినందనల సత్తా ఏమిటో, అవి ఎంతటి ఉత్తేజాన్ని యిస్తాయో , ఎంచుకున్న కార్యక్షేత్రంలో మరింత పూనికతో, మరిన్ని సత్ఫలితాల సాధనకోసం పనిచేయడానికి ఎంత ప్రోత్సాహాన్ని అందిస్తాయో ఏపిమాస్‌కు రెండు దశాబ్దాలకు పైగా స్వానుభవమే. గత 24 ఏళ్ళ కాలంలో ఏపిమాస్ ఒక్కొక్క మెట్టుగా పైపైకి ఎదుగుతూ, మహిళలు , పేదలు , రైతుల సేవలో ఎంతో అంకితభావంతో, సామర్ధ్యంతో, అవిశ్రాంతంగా కృషిచేస్తున్నదంటూ, ఇటీవలే, జులై 1,2 తేదీలలో ఏపిమాస్ 24 వ వార్షికోత్సవ సందర్భంగా ఛైర్మన్, పాలకవర్గ సభ్యులు. దాతృత్వ సంస్థల ప్రతినిధులు, వివిధ ప్రాజెక్టులలో ఏపిమాస్ సహభాగస్వాములు, శ్రేయోభిలాషులు, సిబ్బంది చేసిన ప్రశంసలు , తెలిపిన అభినందనలు, అందించిన, అందిస్తున్న ప్రోత్సాహం, సహకారం చిరస్మరణీయం. అందుకు వారందరికి మన:పూర్వక కృతజ్ఞతలు. ఎంచుకున్న వివిధ రంగాలలో ఏపిమాస్‌తో కలసి పనిచేయడానికి ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు అనేకం ముందుకు వస్తుండడం ఈ వాస్తవాన్నే విశదపరుస్తుంది. రజితోత్సవ సంవత్సరంలో ప్రవేశించిన ఏపిమాస్ మరింత అవగాహనతో , అంకిత భావంతో , కార్యదక్షతతో, మరిన్ని సేవలతో, నిర్దేశించుకున్న సత్ఫలితాల సాధనకు సుదీర్ఘ ప్రస్థానానికి కృత నిశ్చయంతో వుంది.

ఇతరులకు స్ఫూర్తిదాయకంగా నిలవడం, యితరుల విజయాలనుంచి స్ఫూర్తి పొందడం విజ్ఞుల లక్షణం. చుట్టూ గిరిగీసుకుని కూచోడం కాకుండా, బాహ్య ప్రపంచంలో జరుగుతున్న అశేష,అసంఖ్యాక అద్భుత విజయాల పరంపరలో కొన్నిటినైనా గమనించి స్ఫూర్తి పొందగలగాలి. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రప్రభుత్వ పథకాలైన 'ఒక జిల్లా , ఒక ఉత్పత్తి ', 'స్వచ్ఛ సర్వేక్షణ్' నిర్వహణలో ఉత్తమమైన పనితీరుకనబరచి, ఈ ఏడాది ఎన్నో జాతీయ పురస్కారాలను అందుకోగలిగింది. అందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని, ఈ విజయాలకు సూత్రధారులు, పాత్రధారులైన వారందరిని ఏపిమాస్ మన: పూర్వకంగా ప్రశంసిస్తున్నది, అభినందిస్తున్నది. ఇంతేకాకుండా, ఈ విజయాలతో యిటు ఏపిమాస్, అటు వివిధ ప్రాజెక్టులలో , కార్యక్రమాలలో ఏపిమాస్ భాగస్వామ్య సంస్థలు , వ్యక్తులు మరింత స్ఫూర్తి పొందాలని ఆకాంక్షి స్తున్నది. ఈ రెండు పథకాలలో కొన్ని జిల్లాలే విజేతలుగా నిలవగలిగాయి. ఏం, ప్రతి జిల్లా ఏదో ఒక చక్కని ఉత్పత్తిలో ఆదర్శవంతమైన, ప్రామాణికంగా నిలువగలిగిన కృషి చేయలేదా, సాధించలేదా ? ఇకనైనా మరింతగా ప్రయత్నించాలి కదా! కనీసం ఏపిమాస్ నిర్వహణలోని ఎఫ్ పి ఓలు, స్వయంసహాయ సమాఖ్యలైనా ఈ విషయంలో చొరవచూపలేవా? ఆలోచించండి.


**Edited, Printed, Published and owned by T.Chandra Sekhar Reddy; Printed at Kala Jyothi Process Pvt Ltd, Plot No.CFC-1&2, Survey No.18, E-city, SEZ, General Industrial Park, Raviryal and Srinagar, Maheswaram, Ranga Reddy District, Telangana - 501359 and Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12,HUDAColony, Tanesha Nagar, Near DreamVally, Manikonda,Ranga Reddy District,Telangana-500089. Editor:T.Chandra Sekhar Reddy**


అనుబంధం అంటే ఒకరిపట్ల ఒకరికి వుండే ఆత్మీయతే కాని, దీర్ఘకాల పరిచయమో, ఇచ్చిపుచ్చుకోడమో కాదు

# మహిళా సాధికారత

ఎడిటర్ : **టి.చంద్రశేఖర రెడ్డి** అసోసియేట్ ఎడిటర్ : **జె.వి. క్రిష్ణమూర్తి**

**ఎడిటోరియల్ కమిటి: ఎన్ వినాయక రెడ్డి, ఎల్. భవాని, ఆర్ రమాదేవి, ఎం. భార్గవి, జి. శ్రీనివాస్, కె శ్రీనివాస్, ఆర్ బ్రహ్మచారి**

**కంపోజింగ్, డిజైనింగ్ : ఎన్. రమాదేవి, కన్సల్టెంట్ : కె. రఘురామరాజు**

**సమన్వయ సహకారం : పి. ఝాన్సీ లక్ష్మి, సాంకేతిక సహకారం : క్రిస్టాఫర్ వసంత్**

## లోపలి పేజీలలో ....


- 5వ ఏడాది సమాఖ్యలకు జాతీయ పురస్కారాలు 05
- ఏపిమాస్ 24వ వార్షికోత్సవం 07
- వ్యాపారవేత్తను చేసిన పుట్టగొడుగుల పెంపకం 09
- ఎస్‌హెచ్‌జి సమాఖ్యల పురస్కార జైత్రయాత్ర! 11
- పాడి రైతులకు ఉపయోగకరంగా మిల్క్ బూస్టర్ 14
- ఇంటర్న్‌షిప్ ద్వారా విద్యార్థినుల సమాజ సేవ 15
- ఏపిమాస్ ... మాస్ ... మాస్ 17
- సైబర్ నేరగాళ్ళ సరికొత్త మోసాలు 18
- 'బన్ని గేదె'కు రూ.14 లక్షల ధర 24
- తెలుగును బతికించండంటూ భాషాఘోష 25
- నౌకాదళ ఫైటర్ పైలట్‌గా ఆస్థా పూనియా 26
- ఏపిమాస్ ఆధ్వర్యంలో వి ఓ ఏలకు శిక్షణ 27
- ఏపిమాస్‌చే మరుగుదొడ్ల నిర్మాణం 28
- మహిళల ఆధ్వర్యంలో కామన్ సర్వీస్ సెంటర్లు 29
- ఆంధ్రప్రదేశ్ కు జాతీయ పురస్కారాల పంట 30
- చెత్త వేయండి...సరుకులు పట్టుకెళ్లండి 31
- కవర్లలో చుట్టిన మామిడి పండ్లకు అధిక ధర! 32
- ఐ రా స పదవికి తెలుగు మహిళ నామినేషన్ 33
- చిన్నారుల సంరక్షణ కేంద్రాలు 34


## 'మహిళాభివృద్ధి సొసైటీ' (ఏపిమాస్)

'**మ**హిళా సాధికారత' పత్రిక మాతృ సంస్థ మహిళాభివృద్ధి సొసైటీ. దీనిని ఏపిమాస్ అని, మాస్ అని కూడా సంక్షిప్తంగా పిలుస్తారు. 2001జూన్ 14 వ తేదీన పబ్లిక్ సొసైటీగా మహిళాభివృద్ధి సొసైటీ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైంది. తెలుగు రాష్ట్రాలలో, మన దేశం లోని ఇతర అనేక రాష్ట్రాలలో మహిళా స్వయంసహాయ సంస్థల సుస్థిరాభివృద్ధికి విశేష సేవలను అందించిన ఈ సంస్థ ప్రస్తుతం రైతుల అభ్యున్నతికి, పర్యావరణ పరిరక్షణకు, ఆదర్శ గ్రామాల నిర్మాణానికి, స్వయంసహాయ సంస్థల స్వయం నియంత్రణకు గణనీయమైన కృషి చేస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాన కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ చేసిన శ్రీ కె. మాధవరావు ఛైర్మన్‌గా వివిధ రంగాలలో విశేషానుభవం గడించిన ప్రముఖులు ఈ సంస్థ పాలకవర్గంలో వున్నారు. సంస్థ వ్యవస్థాపక సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ఎండి గా, సిఇఓ గా వున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్‌లలో కార్య క్రమాలను నిర్వహిస్తున్న ఈ సంస్థకు ప్రధాన కార్యాలయంతో పాటు, ఒక ప్రాంతీయ కార్యాలయం, 21 క్షేత్ర కార్యాలయాలు వున్నాయి. దాదాపు 250 మందికి పైగా సిబ్బంది వున్నారు. ప్రజలకు అవగాహన కలిగించడం కోసం 'మహిళా సాధికారత' పత్రికతో పాటు వివిధ వైజ్ఞానిక పుస్తకాలను, ఈ సంస్థ ప్రచురిస్తుంటుంది.


| ప్రోత్సాహక చందా | | |
|---|---|---|
| ఏడాదికి | : | రూ. 110 |
| రెండేళ్లకు | : | రూ. 200 |
| మూడేళ్లకు | : | రూ. 280 |

| ప్రకటన ఛార్జీలు | |
|---|---|
| మల్టీకలర్ ఫస్ట్ పేజి (సగం)/బ్యాక్ పేజి(పూర్తి) | : రూ. 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్ పేజి (పూర్తి) | : రూ. 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ లోపలి పేజి (పూర్తి) | : రూ. 10,000 |

**చందాలు లేదా ప్రకటనలకోసం పంపే డిడిలను 'ఏపిమాస్ -హైదరాబాద్' పేరుమీద పంపాలి**

మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్,
డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089. ఫోన్ : 08413-403118
Web: www.apmas.org, E Mail: info@apmas.org


ఆశాభావం అన్నిటినీ అనుకూలంగా మార్చే మంత్రదండం కాదు, దేనికైనా నిన్ను సిద్ధంచేసే మనోబలం !

# వరుసగా 5వ ఏడాది సమాఖ్యలకు జాతీయ పురస్కారాలు!

**– జి శ్రీనివాస్**

ఏపిమాస్, ఎనేబుల్ నెట్‌వర్క్ సంయుక్తంగా నాబార్డ్ తోడ్పాటుతో 2021వ సంవత్సరంలో ఎస్‌హెచ్‌జి సమాఖ్యలకు జాతీయ పురస్కారాలను ప్రవేశపెట్టాయి, భారతదేశంలో నిర్వహణపరంగా అత్యుత్తమమైన ఎస్.హెచ్.జి సమాఖ్యలను గుర్తించి, గౌరవించాలన్న లక్ష్యంతో ఈ పురస్కారాలను ఏర్పాటు చేశారు. ఆ శ్రేణిలో పంచమ వార్షిక పురస్కారాలను ఏపిమాస్, జర్మనీకి చెందిన డి జి ఆర్ వి సంయుక్త ఆధ్వర్యంలో ప్రదానం చేయనున్నట్టు ఏపిమాస్ ప్రకటించింది. ఈ పురస్కారాలకోసం ఆన్‌లైన్‌లో నామినేషన్లకు చివరి తేదీ 20-08-2025.

ఈ ఆవార్డులు స్వయం సహాయ ఉద్యమాన్ని మరింత ప్రోత్సహించడానికి, ఆ ఉద్యమ విజయాలను ఉత్సవంగా జరుపుకోవడానికి ఉద్దేశించినవని, అందువల్ల అర్హత కలిగిన అన్ని స్వయం సహాయ సమాఖ్యలు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపిమాస్ పేర్కొన్నది.

**అవార్డుల వివరాలు**

**జాతీయ స్థాయి:**

| | |
|---|---|
| • మొదటి : | 1,00,000 |
| • రెండవ : | 75,000 |
| • మూడవ : | 50,000 |

**ప్రాంతీయ స్థాయి:**

(ఉత్తర, దక్షిణ, తూర్పు, పశ్చిమ, ఈశాన్య ప్రాంతాలకు)

| | |
|---|---|
| • మొదటి : | 40,000 |
| • రెండవ : | 20,000 |

**కనీస అర్హతలు**

ఈ క్రింద పేర్కొన్న కనీస అర్హతలు వుంటే ఆ స్వయం సహాయ సమాఖ్యలు (ఎస్ హెచ్ ఫెడరేషన్లు) ఈ పురస్కారాల కోసం పరిశీలనార్హమైనవే.

- ఎస్.హెచ్.జి సమాఖ్యలు గ్రామీణ ప్రాంతానికి చెందినవైనా, పాక్షిక పట్టణ , లేదా పట్టణ ప్రాంతానికి చెందినవైనా కూడా ఈ పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హమైనవే. ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన సమాఖ్యలైనా, ఎన్ జి ఓలు ఏర్పాటు చేసిన సమాఖ్యలైనా కూడా నామినేషన్లు పంపవచ్చు.
- ప్రధాన భౌగోళిక ప్రాంతాలలోని సమాఖ్యలు: కనీసం 1,200 మంది సభ్యులను లేదా 125 ఎన్ హెచ్ లను కలిగి వుండాలి.
- కొండ ప్రాంతాలు, ఐ టి డి ఏ గుర్తించిన గిరిజన ప్రాంతాలలోని సమాఖ్యలు : కనీసం 700 మంది సభ్యులను లేదా 100 ఎస్. హెచ్ జి లను కలిగి వుండాలి.
- సమాఖ్య గత మూడేళ్ళుగా నిర్వహణ పరంగా స్వయంసమృద్ధి సాధించి వుండాలి
- సమాఖ్య రిజిస్ట్రేషన్ తేదీ నుంచి కనీసం 3 సంవత్సరాలుగా పని చేస్తూ వుండాలి. (కొండ ప్రాంతాలు, ఐ టి డి ఏ గుర్తించిన గిరిజన ప్రాంతాలు, ఈశాన్య రాష్ట్రాలలోని సమాఖ్యల విషయంలో రెండేళ్ళకు సడలింపు వుంది. కనీసం రెండు సంవత్సరాల ఆడిట్ రిపోర్టులు అవసరం)
- ఇంతకుముందు ఈ అవార్డు పొందిన సమాఖ్యలు తర్వాతి మూడేళ్ళపాటు దరఖాస్తు చేసుకోవడానికి అర్హమైనవి కావు. ఉదాహరణకు : 2024 సంవత్సరం లో అవార్డు పొందిన సమాఖ్య తిరిగి 2028వ సంవత్సరంలో దరఖాస్తుకు అర్హత కలిగి వుంటుది).

**ఎంపిక విధానం**

- అర్హత కలిగిన ఎస్ హెచ్ జి సమాఖ్యలు, మహిళా ఎఫ్ పి ఓలు స్వయంగా లేదా ప్రోత్సాహక సంస్థ

ద్వారా నిర్ణీత క్లుప్త పద్ధతిలో దరఖాస్తుచేసుకోవచ్చు.

- నిబంధనలకు అనుగుణంగా వున్నట్టు తేలిన సమాఖ్యలకు ఇ-మెయిల్ ద్వారా సమాచారాన్ని తెలియజేసి, మరిన్ని వివరాలతో దరఖాస్తు చేసుకోడానికి ఆన్ లైన్ లింక్ పంపించడం జరుగుతుంది.
- నిపుణుల బృందం అన్ని దరఖాస్తులను పరిశీలించి, అవార్డులకు ఎంపికకోసం జ్యూరీకి పంపుతారు
- ఏ సమాఖ్యలు అవార్డులకు అర్హమైనవో జ్యూరీ నిర్ణయిస్తుంది

**సూచనలు**

1) దరఖాస్తు పూర్తి చేయడానికి ముందుగా సూచనలను పూర్తిగా చదవాలి
2) దరఖాస్తులో యిచ్చే సమాచారం ఎస్ హెచ్ జి సమాఖ్యలను నిర్ణీత నిబంధనల ప్రకారం అంచనా వేసేందుకు మాత్రమే ఉపయోగించడం జరుగుతుంది
3) సమర్పించిన పత్రాలు ఆవార్డుల కార్యాలయానికి చెందుతాయి
4) దరఖాస్తుతోపాటు ఈ క్రింద పేర్కొన్న పత్రాలను తప్పనిసరిగా జతచేయాలి
   - గత మూడేళ్ళ ఆడిట్ చేసిన ఫైనాన్షియల్ స్టేట్మెంటు
   - డిమాండ్ , కలెక్షన్ , బ్యాలెన్స్ స్టేట్మెంట్
   - స్వయంసహాయ సంఘాల ఎం ఐ ఎస్ (పైన పేర్కొన్న డాక్యుమెంట్లు లేని దరఖాస్తులను పరిశీలనకు తీసుకోరు)
5) తుది నిర్ణయం జ్యూరీదే
6) ఆన్లైన్లో దరఖాస్తు నింపే ముందు, నమూనా దరఖాస్తు ప్రింట్ తీసుకుని, దానిని పూరించి సరిచూసుకుని, ఆన్లైన్లో వివరాలు పొందుపరచాలి
7) ఆన్లైన్లో ఒకసారి దరఖాస్తు సమర్పించిన తర్వాత యిక ఎట్టి మార్పుచేర్పులకు అవకాశం వుండదు
8) ప్రతి భాగాన్ని పూర్తిచేసిన పిమ్మట, తదుపరి భాగం లింక్ మీ మెయిల్ – ఐ డి కి పంపబడుతుంది
9) దరఖాస్తులు నేరుగా (హార్డ్ కాపీలు) స్వీకరించబడవు

దరఖాస్తుకు చివరి తేదీ : 20-08-2025. మరిన్ని వివరాలను, దరఖాస్తు ఫారాన్ని ఈ క్రింది లింక్ ద్వారా పొందవచ్చు:

http://apmas.in/shgfed2025

**ఏ అంశానికి ఎన్ని పాయింట్లు ?**

| **అంశం** | **పాయింట్లు** |
|---|---|
| 1) పాలన | 20 |
| 2) వనరులు | 08 |
| 3) ఆస్తులు | 10 |
| 4) సిస్టమ్స్ | 10 |
| 5) లాభదాయకత | 15 |
| 6) సమాఖ్య అందించిన సేవలు | 10 |
| 7) సభ్య సంస్థల పనితీరు | 20 |
| 8) కేస్ స్టడీలు, ఆవిష్కరణలు, ప్రత్యేక కృషి, విజయ గాధలు, సేవల వైవిధ్యం : | 07 |
| **మొత్తం** | **100** |

## ఆంధ్రప్రదేశ్‌లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

**2**025 ఆగస్టు 15వతేదీ నుంచి ఆంధ్రప్రదేశ్‌లో మహిళలకు ఏ పి ఎస్ ఆర్ టి సి బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్టు ప్రభుత్వం పేర్కొన్నది.'ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కింద మహిళలు రాష్ట్రమంతటా ఎక్కడి నుంచి ఎక్కడికైనా తిరగొచ్చు. దీనిపై ఎలాంటి పరిమితి లేదు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో, సిటీ సర్వీసుల్లో మాత్రమే ఉచిత ప్రయాణం చేయొచ్చు' అని రవాణా శాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి, ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంపై తిరుపతిలో రాయలసీమ జోన్ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. దీనికి సంబంధించి త్వరలోనే తుది మార్గదర్శకాలు వెలువరిస్తామని చెప్పారు. ■

# రజితోత్సవ ప్రేరణ నింపిన ఏపిమాస్ 24వ వార్షికోత్సవం!

– కే. శ్రీనివాస్

ఏపిమాస్ 24వ వార్షికోత్సవం 2025జులై 1, 2 తేదీలలో హైదరాబాద్‌లోని ఏపిమాస్ ప్రధాన కార్యాలయంలో ఉత్సాహంగా జరిగింది. 2001జులై 1వ తేదీన ఆవిర్భవించి, గత 24 సంవత్సరాలుగా మన దేశవ్యాప్తంగా యింకా



అనేక ఇతర దేశాలలోను ఎన్నో కార్యక్రమాల ద్వారా సమాజంలోని నిరుపేదలు, బడుగు వర్గాలు, ముఖ్యంగా మహిళల అభ్యున్నతికి అంకితభావంతో, ఫలప్రదంగా, ప్రభావోత్పాదకంగా విశేష కృషి సాగిస్తూ, 25వ వసంతంలోకి అడుగిడిన శుభ సందర్భంలో ఈ 24వ వార్షికోత్సవం ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ రెండు రోజుల కార్యక్రమంలో వివిధ రాష్ట్రాలలో పని చేస్తున్న ఏపిమాస్ సిబ్బంది, పాలకవర్గం నుంచి చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన కార్యక్రమంలో, తొలుత ఏపిమాస్ సి ఇ ఓ, ఎం డి శ్రీ సి.ఎస్.రెడ్డి మాట్లాడుతూ, ఏపిమాస్ విజన్ సాధనలో నిరంతరం మద్దతు, ప్రత్యక్ష తోడ్పాటు అందించిన, అందిస్తున్న ఏపిమాస్ సిబ్బందికి, వారి కుటుంబాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఏపిమాస్ వ్యవస్థాపకుల దూరదృష్టి, నిరంతర మద్దతు కారణంగానే ఏపిమాస్ ఈ స్థాయికి చేరుకోగలిగిందంటూ, వారికి ధన్యవాదాలు తెలియజేశారు. ఏపిమాస్ చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్న దాతృత్వ సంస్థలకు, భాగస్వాములకు (యుఎస్ఏ ఐ డి, కేర్, ఫోర్డ్ ఫౌండేషన్, డి ఎఫ్ ఐ డి, బి ఎం జిఎఫ్, జి ఐ జడ్, అరబిందో ఫార్మా, నాబార్డ్, డి జి ఆర్ వి, బి ఎఫ్ డబ్ల్యు, వరల్డ్ బ్యాంక్, టాటా ట్రస్ట్, సిడ్బి, ఎస్ బి ఐ మొదలైన సంస్థలు) హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ 'రజితోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా 25 కార్యక్రమాలు నిర్వహించండి' అంటూ ఏపిమాస్ వ్యవస్థాపకుల్లో ఒకరైన శ్రీ విజయ్ మహాజన్ సూచించినట్టు శ్రీ సి.ఎస్. రెడ్డి తెలిపారు.

అనంతరం ఏపిమాస్ నిర్వహణలో సాధించిన సత్ ఫలితాలను, అనుకున్నంతగా సాధించలేని అంశాల గరించి క్లుప్తంగా వివరించారు. వాతావరణ, సాంకేతిక పరిణామాలు, భౌగోళిక, రాజకీయ వైరుధ్యాల వంటి బాహ్య పరిస్థితులలో వస్తున్న మార్పుల పట్ల శ్రీ సి ఎస్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేస్తూ, ఈ మార్పుల కారణంగా, ఏపిమాస్ వంటి సంస్థలుభాగస్వామ్యాలు ఏర్పాటు చేసుకోవడం, గరిష్ట ప్రయోజనాల కోసం కలిసి పని చేయడం కష్టంగా మారుతోందని అన్నారు.

**మూడు శక్తుల ఏపిమాస్**

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన ఏపిమాస్ ఛైర్మన్ శ్రీ కాకి మాధవరావు ప్రసంగిస్తూ, సంస్థతో

తన అనుభవాలను పంచుకున్నారు. ఏపిమాస్ సామూహిక సంస్థల శక్తిని, కలిసికట్టుగా పని చేసే శక్తిని, సంఘటిత చర్యల శక్తిని ప్రభావవంతంగా ప్రదర్శించిందని ఆయన ప్రశంసించారు. ఈ ప్రక్రియ అంతా సహకార దృక్పథంతో జరిగిందాన్ని చెబుతూ, ఏపిమాస్ తన బలాన్ని గుర్తించి, దాన్ని నిగ్రహించి ఉపయోగించుకోవాలని, తన పాత్ర సామాజిక న్యాయాన్ని, ఆర్థిక సాధికారతను మరింత పెంపొందించే రీతిలో సాగాలని ఆయన సలహా యిచ్చారు.

ఏపిమాస్ వైస్ ఛైర్‌పర్సన్ శ్రీమతి మహపారా అలీ ఏపిమాస్ సాధించిన విజయాలను వివరిస్తూ, సంస్థ భవిష్యత్తులో పోషించవలసిన పాత్రను సూచించారు. ప్రతిభ కలిగిన శిక్షకులను తయారుచేయడం, శిక్షణ మాడ్యూళ్ళను రూపొందించడం మొదలైన అంశాలలో ప్రతిభ కలిగిన శిక్షకులను తయారుచెయ్యడం, శిక్షణా మాడ్యులు రూపొందించడం మొదలైన అంశాలలో ఏపిమాస్ చేసిన కృషి ప్రభావవంతమైనదని, సంస్థ దీర్ఘకాలిక ప్రభావం కలిగించే కార్యక్రమాలను చేపట్టే నైపుణ్యాన్ని సంపాదించిందని ఆమె కొనియాడారు. ప్రభుత్వాలు, ప్రముఖ సంస్థలు శ్రీ సి.ఎస్. రెడ్డిని వివిధ వేదికలకు ఆహ్వానించడం ఏపిమాస్ కృషికి లభించిన గొప్ప గుర్తింపుగా ఆమె పేర్కొన్నారు. ఇంతేకాకుండా ఎస్ హెచ్ జి సమాఖ్యల జాతీయ అవార్డుల కార్యక్రమం ద్వారా ఏపిమాస్ ఎంతో ప్రభావవంతమైన, విలువలతో కూడిన, ఆదర్శవంతమైన వాతావరణాన్ని సృష్టించింది. ఇలాంటి కార్యక్రమాలు కొనసాగాలి, మరింత విస్తరించాలి, పునరావృతం కావాలని ఆమె ఆకాంక్షించారు.

ఏపిమాస్ బోర్డు సభ్యులు సంస్థ 25వ సంవత్సరంలో అడుగుపెట్టిన సందర్భంగా శ్రీ సి.ఎస్. రెడ్డికి సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. వారి మాటల్లో :

- **డా. డబ్ల్యూ.ఆర్ రెడ్డి :** పౌర సమాజ సంస్థలు పని చేసే వ్యవస్థలో అనేక మార్పులు వచ్చాయి. ఈ సమయంలో ఏపిమాస్ తన పాత్రను తిరిగి నిర్వచించడం, పునరాలోచించడం అత్యవసరం. సమాజాల్లో ఆశలు మారుతున్నాయి. మరింతగా విధానపరమైన సలహా సంప్రతింపులు అవసరం. సంస్థ సాంకేతికంగా మరింత శక్తి సామర్థ్యాలను సంతరించుకోవాలి.
- **శ్రీమతి గౌరీ కృష్ణ:** ఏపిమాస్‌కు చురుకైన నాయకత్వం, శక్తివంతమైన క్షేత్ర సిబ్బంది ఉన్నారు. వారు నిజమైన మార్పు తీసుకుని రాగలరు. డాక్యుమెంటేషన్ కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలి.
- **శ్రీ ఎన్.వి. రమణ :** ఏపిమాస్ ప్రక్రియ ఆధారిత దృక్పథాన్ని కలిగి ఉంది. ప్రతి సందర్భం ఈ సంస్థకు ఒక అవకాశమే. ఇది ఒక అభ్యాస సంస్థ. ప్రభుత్వ వ్యవస్థలు ఏపిమాస్‌ను ఒక నాయకత్వ, సమస్య పరిష్కరణ, ప్రభావవంతమైన సంస్థగా గుర్తించాయి. స్వయం సహాయ సంఘాలను, సమాఖ్యలను, సూక్ష్మ రుణ సంస్థలను, ఎఫ్ పి ఓ లను ఎంతగానో ప్రభావితం చేస్తున్నది. ఏపిమాస్ భాగస్వామ్యంతో పని చేసే సంస్థలు తమ ప్రభావాన్ని 10 రెట్లు పెంచుకోవచ్చు.
- **శ్రీ మోహనయ్య :** సంస్థ 25వ సంవత్సరం లోకి అడుగు పెట్టినందుకు అభినందనలు. రాబోయే రోజులలో ఏపిమాస్ ప్రకృతి వ్యవసాయాన్ని (నాచురల్ ఫార్మింగ్) మరింత ప్రోత్సహించాలి. ఎంత ఎక్కువ విస్తీర్ణంలో ఆ వ్యవసాయం చేస్తే, అంతగా ఉపయోగం వుంటుంది.

### 2030 లక్ష్యాలపై ప్రధానంగా చర్చ

స్వయం సహాయ సంఘాలు, సమాఖ్యలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, సమాఖ్యలు, ప్రకృతి వ్యవసాయం, ఆరోగ్యం, పోషణ, వాష్ అనే నాలుగు ముఖ్యమైన అంశాలపై ఏపిమాస్ పని చేస్తున్నది. ఈ నాలుగు అంశాల విషయంలో 2030వ సంవత్సరం నాటికి సాధించాలని పెట్టుకున్న లక్ష్యాలను, ఆ లక్ష్యాల ప్రస్తుత స్థితిని, లక్ష్యాల సాధనకు అనుసరించాల్సిన ప్రణాళికల గురించి మరింత లోతుగా చర్చించడం కోసం సిబ్బంది అందరినీ 4 బృందాలుగా విభజించి, చిన్న బృంద చర్చలు జరుపబడ్డాయి.

(మిగతా 16వ పేజీలో )

బలం అంటే ఇష్టంలేనివాటిని నాశనం చేయడం కాదు, ఇష్టమైనవాటిని కష్టమైనా సృష్టించుకోవడం

# గిరిజన మహిళను వ్యాపారవేత్తను చేసిన పుట్టగొడుగుల పెంపకం!

– పరిమి గంగాధర్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం చౌటిగూడెం గ్రామంలో శ్రీమతి తానం లత, శ్రీ తానం రాజశేఖర్ అనే గిరిజన దంపతులు నివసిస్తున్నారు. శ్రీమతి లత 2017లో ఇందిరా క్రాంతి స్వయం సహాయ సంఘంలో చేరారు. లత ఇంటర్ వరకు చదువుకొన్నది. లత, ఆమె భర్త రాజశేఖర్ ఇరువురూ వ్యవసాయ కూలీ పనులకు వెడుతూ, జీవనం సాగిస్తుండేవారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కూలీద్వారా వచ్చే ఆదాయం కుటుంబ పోషణకు సరిపోయేది కాదు. ఈ కారణంగా వారు స్వంతగా ఏదైనా వ్యాపారం చెయ్యాలనే ఆలోచనతో ఉండేవారు కాని వారికి సరైన అవగాహన లేక, ఏమి చెయ్యాలో తెలియక అలానే ఉండిపోయారు.

ఒకరోజున గ్రామైక్య సంఘం సమావేశంలో సిఆర్‌పి ఇపి పాల్గొని ఏపిమాస్ ద్వారా అందించే పుట్టగొడుగుల పెంపకం శిక్షణ గురించి వివరించారు. ఆ సమావేశంలో పాల్గొన్న లత తాను కూడా ఆ శిక్షణ పొందవచ్చునా అని అడగ్గా, మండల కేంద్రంలోని పుసుగూడెం గ్రామంలో పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ కార్యక్రమం ఉంటుందని వివరించి ఆమెను శిక్షణలో పాల్గొనే విధంగా ప్రేరేపించడం జరిగింది. 2024 సెప్టెంబర్‌లో పుట్టగొడుగుల పెంపకంపై లత 10రోజుల శిక్షణ పొందింది.

శిక్షణ కాలంలో నాణ్యమైన పుట్ట గొడుగుల పెంపకానికి సంబంధించిన వివిధ మెలకువలను, ఇంటిలోనే పెంపకానికి ఏర్పాట్లు ఎలా చేసుకోవాలో, వ్యాపార అభివృద్ధికి ప్రణాళికలు, మార్కెటింగ్ మెలకువలు, వాటిని ఎక్కడ విక్రయించాలి, ఎలా నిల్వ చెయ్యాలి అనే అంశాలపై అవగాహనను పెంపొందించుకున్నది. అనంతరం లత తన భర్త రాజశేఖర్ సహకారంతో తమ ఇంటిలోనే 2000/– రూపాయల సొంత పెట్టుబడితో పుట్టగొడుగుల పెంపకం ప్రారంభించింది. ఆ సమయంలో కొందరు గ్రామస్తులు యిలా పెంచే పుట్టగొడుగులు ఎవరు కొంటారు? ఎవరు



తాను పెంచుతున్న పుట్టగొడుగులతో లత

తింటారు? ఇవి అమ్మడం కష్టం అని నిరుత్సాహపరిచారు. కాని లత వాటిని పట్టించుకోక, తన ఈ వ్యాపారాన్ని ఎలా వృద్ధి చెయ్యాలా అని ఆలోచిస్తూ, కావలసిన సమాచారాన్ని ఏపిమాస్ సిఆర్‌పి – ఈపీ నుండి తెలుసుకొంటూ, మున్ముందుకు సాగారు. వారు పెంచిన పుట్ట గొడుగులను తమ ఊరి నుండి రాకపోకలు సాగించే వారికి పరిచయం చేశారు. ముఖ్యంగా పాఠశాల టీచర్లకు అమ్మ సాగారు. దీనితోపాటు తమ ఊరి సమీపంలోని పాల్వంచ సూపర్ మార్కెట్‌కు సరఫరా చేయసాగారు. ఈ విధంగా వారి వ్యాపారం రోజు రోజుకు అభివృద్ధి చెందసాగింది.

వ్యాపారం రోజురోజుకు పెరుగుతుండడంతో, లత

**మన మనస్సు ఒక ఆయస్కాంతం ! మంచిని తలిస్తే మంచిని, చెడును తలిస్తే చెడును అది ఆకర్షిస్తుంది**

దంపతులు పుట్టగొడుగుల పెంపకానికి ప్రత్యేకంగా నాలుగు గదులతో ఒక ఇంటిని నిర్మిస్తున్నారు. ఇప్పుడు తానం లత ఆ ప్రాంతానికి ఒక వ్యాపారవేత్తగా ఎదిగింది. ప్రస్తుతం ఇంటివద్దే ఎక్కువగా ఆర్డర్స్ తీసుకుని విక్రయిస్తున్నారు.

ఈ పుట్టగొడుగుల పెంపకానికి ముందు లత దంపతులిద్దరూ రోజువారి కూలీ పనులకు వెళ్తే గాని కుటుంబ పోషణ జరగని స్థితి నుండి, ఇప్పుడు తమ కుటుంబంతో పాటు వారి పుట్టింటికి, అత్తమామల కుటుంబాలకు కూడా సహాయకారిగా ఉంటున్నారు.

**లత ఆర్థిక స్థితి : వ్యాపారానికి ముందు ... తరువాత**

| | | |
|---|---|---|
| నెలవారీ ఖర్చులు: | 10000/- | 15000/- |
| నెలవారీ రాబడి : | 11500/- | 30000/- |
| నెలవారీ ఆదాయం: | 1500/- | 15000/- |


**నమ్మలేని విజయమిది : లత**

“ఇంతటి మంచి అవకాశం కల్పించిన సిడ్బీ, ఏపిమాస్ సిబ్బందికి నా కృతజ్ఞతలు. ఈరోజు నాకు చాల గర్వంగా ఉంది. దినసరి కూలీగా జీవనం సాగించే అతి నిరుపేద గిరిజన మహిళను, పుట్టగొడుగుల పెంపకం సాగిస్తూ, వాటితో వ్యాపారం చేస్తున్నాను అంటే ఇప్పటికీ నమ్మశక్యంగా లేదు. నా కుటుంబ ఆదాయం పెరగడమే కాకుండా, నేను ఒక వ్యాపారవేత్తగా ఎదగడానికి కూడా ఇది తొలి అడుగు. రాబోయే రోజుల్లో పెద్దఎత్తున పుట్టగొడుగుల తయారు చేయడానికి నాలుగు గదులతో షెడ్ నిర్మిస్తున్నాము. అందులో మంచి వ్యాపారము జరుగుతుందని పూర్తి నమ్మకం ఉంది”.



*సిడ్బీ, ఏపిమాస్ సిబ్బందితో లత*

■



## నెలకు లక్ష ఖర్చు పెట్టించే దున్న !

**మ**హారాష్ట్రలోని కొల్హాపుర్‌లో జరిగిన ‘అగ్రికల్చర్ ఎక్స్‌పో’లో ’ ఓ దున్నపోతు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నాలుగేళ్ల వయసున్న ఈ దున్నపోతు 1,500 కిలోల బరువు, 14 అడుగుల పొడవు ఉంది. హరియాణాలోని పానీపత్‌కు చెందిన నరేంద్ర సింగ్ అనే వ్యక్తి ఈ దున్నపోతును తీసుకువచ్చాడు.

ఈ దున్నపోతును ఏసీ ఉన్న వాహనంలోనే బయట ప్రదేశాలకు తీసుకెళ్తుంటారని నరేంద్ర సింగ్ తెలిపారు. ‘ముర్రా జాతికి చెందిన ఈ దున్న పోషణకు నెలకు 1 లక్ష రూపాయల వరకు ఖర్చవుతుంది. 14 అడుగుల పొడవు ఉన్న ఈ ‘ఆమ్‌దార్’ ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన దున్నపోతు. ఇప్పటివరకు 7 వ్యవసాయ ప్రదర్శనలో ఛాంపియన్‌గా నిలిచింది’ అని నరేంద్ర చెప్పారు. ఈ దున్నపోతు వీర్యానికి కూడా ఫుల్ డిమాండ్ ఉంది.

**భారీగా దాణా**

దున్నపోతు నిర్వహణకు ప్రతిరోజు ఇద్దరు ఉంటారు. ఒకరు దున్నకు బాడీ మసాజ్ చేస్తారు. మరొకరు మేత, దాని నిర్వహణ చూసుకుంటారు. ఆమ్ దార్ రోజుకు 20 లీటర్ల పాలు గటగటా తాగేస్తుంది. అలాగే 20 కిలోల దాణా తింటుంది. 30 కిలోల పశుగ్రాసం, పొట్టు లాగించేస్తోంది. ఈ దున్నపోతును రోజుకు 3సార్లు కడుగుతారు. ఏసీ రూమ్‌లో ఉంచుతారు.

(ఈ టీవి భారత్ సౌజన్యంతో)

■

**తోడు లేకపోతే చిన్న ప్రయాణమైనా నరకమే, మనసుకు నచ్చిన తోడుంటే నరకంలోనైనా స్వర్గమే !**

# ఎస్‌హెచ్‌జి సమాఖ్యల పురస్కార జైత్రయాత్ర!

## ఏపిమాస్ ఆధ్వర్యంలో నాలుగేళ్ళుగా సాగుతున్న అవార్డుల మహోత్సవం

- జి. శ్రీనివాస్

**మ**న దేశంలో స్వయం సహాయ సంఘాల (సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ - ఎస్ హెచ్ జి) ఉద్యమం కేవలం ఒక సామాజిక-ఆర్థిక కార్యక్రమం కాదు, అది కోట్లాది మంది మహిళల ఆశలకు, ఆశయాలకు, ఆత్మవిశ్వాసానికి ప్రతీక. గత మూడు దశాబ్దాలుగా, ఈ ఉద్యమం దేశంలోని గ్రామీణ, పాక్షిక-పట్టణ, పట్టణ ప్రాంతాలలో మహిళల జీవితాల్లో అనూహ్యమైన మార్పులను తీసుకువచ్చింది.

ఆర్థిక స్వాతంత్ర్యం, మెరుగైన జీవనోపాధి అవకాశాలు, సామాజిక న్యాయం, సమాజంలో గౌరవనీయ మైన స్థానం కల్పించడంలో స్వయం సహాయక సంఘాలు, వాటి సమాఖ్యలు (ఫెడరేషన్లు) అపారమైన కృషి చేస్తున్నాయి.

ఈ మహోన్నత ఉద్యమానికి నిరంతరం మద్దతు నిస్తూ, దాని విజయాలను, సవాళ్లను, భవిష్యత్ దిశను లోతుగా విశ్లేషిస్తూ, ఏపిమాస్ సంస్థ 24 వసంతాలను పూర్తి చేసి 25వ వసంతంలో అడుగుపెట్టింది. ఈ విశేష సందర్భాన్ని పురస్కరించుకొని, జాతీయ స్థాయిలో ఉత్తమ పనితీరు కనబరిచిన ఎస్ హెచ్ జి సమాఖ్యలకు (ఫెడరేషన్లకు) గత నాలుగు సంవత్సరాలుగా (2021-2024) ఏపిమాస్ అందించిన ప్రతిష్ఠాత్మక పురస్కారాలు, అవి చూపించిన ఫలితాలు, ఎస్‌హెచ్‌జి ఉద్యమం భవిష్యత్ దిశను ఈ వ్యాసంలో వివరంగా విశ్లేషిస్తున్నాము.

**ఎస్‌హెచ్‌జి ఉద్యమం : పరిణామం ,ప్రభావం**

భారతదేశంలో స్వయం సహాయక సంఘాల ఉద్యమం ఒక వినూత్నమైన, సామాజిక-ఆర్థిక మార్పును తీసుకువచ్చిన నమూనాగా అంతర్జాతీయంగా గుర్తింపు పొందింది. 1990లలో ప్రారంభమైన ఈ ఉద్యమం, క్రమంగా విస్తరించి, ప్రస్తుతం ప్రపంచంలోనే అతిపెద్ద సామాజిక ఆధారిత వ్యవస్థలలో ఒకటిగా నిలిచింది. నాబార్డు, భారత ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు, బ్యాంకింగ్ వ్యవస్థల నిరంతర మద్దతుతో ఎస్‌హెచ్‌జి-బ్యాంక్ లింకేజ్ కార్యక్రమం విస్తృతంగా అమలు జరిగింది. దీనిద్వారా గ్రామీణ పేదల, ముఖ్యంగా మహిళల ఆర్థిక అవసరాలు చాలావరకు తీరాయి. ఎస్‌హెచ్‌జిలు తమ పొదుపులను సక్రమంగా సాగించడంతో పాటు, బ్యాంకులతో అనుసంధానం కావడం ద్వారా భారీ మొత్తంలో రుణాలను పొందగలిగాయి.

2024 మార్చి నాటికి, తాజా గణాంకాల ప్రకారం, దేశంలో 144 లక్షల స్వయం సహాయ సంఘాలు (ఎస్‌హెచ్‌జిలు) క్రియాశీలంగా ఉండి, 17.8 కోట్ల కుటుంబాల జీవితాలను ప్రభావితం చేస్తున్నాయి. ఈ ఎస్‌హెచ్‌జిలు బ్యాంకుల్లో రూ. 65,089 కోట్ల డిపాజిట్లు కలిగి ఉండగా, రూ. 2,59,664 కోట్ల బ్యాంకు రుణాలను క్రియాశీలంగా నిర్వహిస్తున్నాయి. ఒక్కో ఎస్‌హెచ్‌జికి సగటున రూ. 3.35 లక్షల రుణంఉంది. ఈ నిధులు వారి జీవనోపాధిని మెరుగు పరచుకోవడానికి, సూక్ష్మ-వ్యాపారాలను ప్రారంభించడానికి, వివిధ ఆర్థిక అవసరాలను తీర్చడానికి ఉపయోగపడ్డాయి.

ఎస్‌హెచ్‌జిల విజయం, వాటి స్థిరత్వం, స్వీయ-నిర్వహణ అవసరాన్ని నొక్కి చెప్పింది. ఫలితంగా ఎస్‌హెచ్‌జి సమాఖ్యలు ఉద్భవించాయి. ఈ సమాఖ్యలు ప్రాథమికంగా ఎస్‌హెచ్‌జిలకు మద్దతునిచ్చే, వాటి కార్యకలాపాలను సమన్వయం చేసే, బహుళ సేవలను అందించే ఉన్నత స్థాయి సంస్థలుగా పని చేస్తాయి.

**ఎస్‌హెచ్‌జి ఉద్యమ బహుముఖ ప్రభావం**

ఎస్‌హెచ్‌జిలు, వాటి ఫెడరేషన్ల ప్రభావం కేవలం ఆర్థికంగా మాత్రమే పరిమితం కాలేదు. ఇది మహిళల జీవితంలో, సమాజంలో అనేక సానుకూల మార్పులను తీసుకువచ్చింది:

గుణపాఠం నేర్చేవి తప్పులే కావు, ఏ గుణపాఠం నేర్వనిదే అసలైన తప్పు

**1. ఆర్థిక సాధికారత, జీవనోపాధి పెంపుదల**

➪ **సూక్ష్మ రుణాలు, పొదుపు :** మహిళలు చిన్న మొత్తంలో పొదుపు చేయడం , ఎస్‌హెచ్‌జిల నుంచి పరస్పర రుణాలు పొందడం ద్వారా ఆర్థిక క్రమశిక్షణను అలవర్చుకున్నారు. ఈ పొదుపులు వారి ఆర్థిక భద్రతకు పునాదిగా నిలిచాయి. బ్యాంక్ లింకేజ్‌లు భారీ మొత్తంలో నిధులను అందుబాటులోకి తెచ్చాయి. ఇవి వ్యవసాయం, పశుపోషణ, చేతివృత్తులు, వ్యాపారాల వంటి అనేక జీవనోపాధి కార్యకలాపాలలో పెట్టుబడిగా మారాయి. ఉదాహరణకు, ఎస్‌హెచ్‌జిలు జీవనోపాధి కార్యకలాపాలలో రూ. 3.5 లక్షల కోట్ల లావాదేవీలను సులభతరం చేశాయి

➪ **సూక్ష్మ వ్యాపార ప్రోత్సాహం :** ఎస్‌హెచ్‌జి ఫెడరేషన్లు మహిళా యాజమాన్యంలోని సంస్థలకు శక్తివంతమైన ఇంక్యుబేటర్లుగా పని చేస్తున్నాయి. డైరీ, పౌల్ట్రీ, మేకల, గొర్రెల పెంపకం, చేనేత, చేతివృత్తులు, ఆహార ఉత్పత్తులు (బేకరీ, ఊరగాయ యూనిట్లు, చిరుధాన్య ఉత్పత్తులు, జామ్, జెల్లీ తయారీ) వంటి అనేక రంగాలలో మహిళలు విజయవంతంగా వ్యాపారాలను నిర్వహిస్తున్నారు.

➪ **మార్కెట్ అనుసంధానం :** నిరక్షరాస్యులైన ఎస్‌హెచ్‌జి మహిళలకు మార్కెటింగ్ సవాళ్లను ఎదుర్కోవడానికి సహాయపడటం, వివిధ వేదికలు, అవుట్‌లెట్‌లతో నెట్‌వర్క్‌లను ఏర్పాటు చేయడం ద్వారా మార్కెట్‌కు మరింత చేరువ కావడంపై దృష్టి సారించబడింది. అమెజాన్, ఫ్లిప్ కార్ట్ , ఇ-కామర్స్ వంటి వేదికలతో అనుసంధానం ద్వారా ఎస్‌హెచ్‌జి ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ లభిస్తున్నది.

**2. సామాజిక పరివర్తన, లైంగిక న్యాయం**

➪ **ఆరోగ్యం, పోషకాహారం, వాష్ :** ఎస్‌హెచ్‌జిలు, ఫెడరేషన్లు ఆరోగ్యం, పోషకాహారం, వాష్ (నీరు, పారిశుధ్యం, పరిశుభ్రత) పై అవగాహన కల్పించడంలో, సేవలను అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. గర్భిణులు, బాలింతలు, శిశువులు, కౌమార బాలికలలో పోషకాహార లోపం, రక్తహీనత వంటి సమస్యలను గుర్తించి, ఆహార వైవిధ్యాన్ని ప్రోత్సహించడం, సేంద్రియ పెరటితోటలను ప్రోత్సహించడంపై దృష్టి సారించబడింది. ఎస్‌హెచ్‌జి వేదికల ద్వారా మారుమూల గ్రామాలలో, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో, వాష్ ప్రాజెక్టుల విజయవంతమైన అమలు ఈ రంగంలో ఏపిమాస్ ప్రభావాన్ని సూచిస్తుంది.

➪ **సామాజిక సమస్యల పరిష్కారం :** గృహహింస, బాల్య వివాహాలు, లైంగిక అసమానతల వంటి సామాజిక సమస్యలను పరిష్కరించడంలో ఎస్‌హెచ్‌జిలు చురుగ్గా పాల్గొంటున్నాయి. జెండర్ రిసోర్స్ సెంటర్‌లను (జిఆర్‌సిలు) ఏర్పాటు చేయడం ద్వారా మహిళల సాధికారతకు, సామాజిక న్యాయానికి కృషి చేయాలని సిఫార్సు చేయబడింది. మరుగుదొడ్ల నిర్మాణం వంటి కార్యకలాపాలను చేపట్టి, మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడటంలో ఎస్‌హెచ్‌జిలు సహాయపడ్డాయి.

➪ **రాజకీయ భాగస్వామ్యం :** ఎస్‌హెచ్‌జి సభ్యులు స్థానిక సంస్థల సమావేశాలలో చురుకుగా పాల్గొనడం, పంచాయతీ ఎన్నికలలో గెలిచి గ్రామ అభివృద్ధి ప్రణాళికలలో భాగం కావడం ద్వారా రాజకీయ సాధికారతను పొందగలుగుతున్నారు.

**3. సంస్థ బలోపేతం, నాయకత్వం మెరుగుదల**

➪ ఎస్‌హెచ్‌జిలు, ఫెడరేషన్లు తమ కార్యకలాపాలను స్వయంప్రతిపత్తితో, స్వతంత్రంగా నిర్వహించుకోవడానికి ప్రోత్సహించబడ్డాయి. సభ్యుల నిర్వహణ, సమ్మిళిత నాయకత్వం, భాగస్వామ్య నిర్వహణపై దృష్టి సారించబడింది.

➪ మహిళలకు ఆర్థిక నిర్వహణ, మార్కెటింగ్, ఆడిట్ సేవలు, సాంకేతిక నైపుణ్యాల వంటి అంశాలపై శిక్షణ ఇవ్వడం ద్వారా వారి సామర్థ్యాలను పెంపొందించడం జరుగుతోంది.

ఏమి అన్నావనేదానికంటె ఎలా అన్నావనేది ముఖ్యం, మనసును ఒప్పించినా నొప్పించినా అది మాటతీరే !

➪ ప్రారంభంలో సంకోచించిన మహిళలు, స్వయం సహాయ సంఘాలలో చేరిన తర్వాత ఆత్మవిశ్వాసంతో మాట్లాడగలుగుతున్నారు, నిర్ణయాలు తీసుకోగలుగుతున్నారు. తమ హక్కుల గురించి తెలుసుకుంటున్నారు. ఇది వారి వ్యక్తిగత, సామూహిక నాయకత్వానికి నిదర్శనం.

**ఏపిమాస్ జాతీయ అవార్డుల ప్రస్థానం**

2021లో ఏపిమాస్, "ఉత్తమ పని తీరు కనబరచే ఎస్‌హెచ్‌జి ఫెడరేషన్స్‌కు జాతీయ అవార్డులను ప్రారంభించింది. ఎనేబుల్ నెట్‌వర్క్, నాబార్డ్, డి.జి.ఆర్.వి–జర్మనీ, ప్రాదాన్, యఫ్.డబ్లు.డబ్లు.బి, స్టేట్ బ్యాంక్ వంటి సంస్థల సహకారంతో ఎస్‌హెచ్‌జి సమాఖ్యల ఉద్యమానికి ఏపిమాస్ విశేష కృషి చేస్తోంది.

➪ ఈ అవార్డుల కార్యక్రమం, దేశవ్యాప్తంగా అద్భుతమైన పనితీరు కనబరుస్తున్న ఎస్‌హెచ్‌జి ఫెడరేషన్లను గుర్తించి, అవార్డులు పురస్కారాలు అందజేయడం, సన్మానించడం ద్వారా వారు విజయోత్సవాలను జరుపుకోవడానికి, ఉత్తమ పద్ధతులను పంచుకోవడానికి, భవిష్యత్ కార్యా చరణ ప్రణాళికలను రూపొందించడానికి ఏపిమాస్ ఒక వేదికగా నిలిచింది.

➪ ప్రతి సంవత్సరం, ఏపిమాస్ ఎస్‌హెచ్‌జి ఫెడరేషన్లపై జాతీయ స్థాయి సమావేశాలను నిర్వహిస్తుంది. ఈ సమావేశాలలో అవార్డుల ప్రదానం జరుగుతుంది. ఈ సమావేశాలు జ్ఞాన మార్పిడి, ఉత్తమ పద్ధతులను పంచుకోవడం, సవాళ్లను పరిష్కరించడం, ఎస్‌హెచ్‌జి ఫెడరేషన్ల దీర్ఘకాలిక స్థిరత్వం, సాధికారత వైపు ఒక మార్గాన్ని రూపొందించడం లక్ష్యంగా పెట్టుకున్నాయి.

➪ ఈ సమావేశాలలో ఎస్‌హెచ్‌జి ఫెడరేషన్ల ప్రతినిధులు, ఎన్‌జిఓలు, ఎస్ఆర్ఎల్ఎంలు, ఎస్‌యుఎల్ఎం, ఎన్ఆర్ఎల్ఎం, బ్యాంకులు, నాబార్డు, ఎన్‌జిఓ, సిఎస్ఆర్, యఫ్. డబ్లు. డబ్లు బి, స్టేట్ బ్యాంకు, ఈషాఫ్, వాటర్ ఆర్గ్, సా–దాన్, స్త్రీ నిధి తెలంగాణా ప్రతినిధులు పాల్గొన్నారు.

**ఈ అవార్డుల ప్రధాన లక్ష్యాలు:**

1. మన జాతీయ స్థాయిలో, ప్రాంతీయస్థాయిలో ఉత్తమమైన పనితీరు కనబరచిన ఎస్‌హెచ్‌జి ఫెడరేషన్లను గుర్తించి, సన్మానించడం
2. ఎస్‌హెచ్‌జి ఫెడరేషన్లను స్వయం ప్రతిపత్తితో, సుస్థిరాభివృద్ధి సాధించే, స్వతంత్ర సంస్థలుగా అభివృద్ధి చేయడంలో ఆచరిస్తున్న వినూత్న విధానాలను, ఉత్తమ పద్ధతులను, నేర్చుకున్న పాఠాలను పంచుకోవడం
3. ఎస్‌హెచ్‌జి ఫెడరేషన్లను సభ్యుల స్వయం నిర్వహణలో, స్వయంప్రతిపత్తి గల, బహుళ సేవా సంస్థలుగా అభివృద్ధి చేయడానికి ఆచరణాత్మక విధానాల పునరుద్ధరణకు తోడ్పాటు అందించడం.

**రాష్ట్రాల వారీగా అవార్డు విజేతల వివరాలు**

2021 నుండి 2024 వరకు అవార్డులు పొందిన రాష్ట్రాలు, అవార్డుల సంఖ్య

| క్ర.సం | రాష్ట్రం | 2021 అవార్డులు | 2022 అవార్డులు | 2023 | 2024 అవార్డులు | మొత్తం అవార్డులు |
|---|---|---|---|---|---|---|
| 1 | ఆంధ్రప్రదేశ్ | – | 2 | 4 | 2 | 8 |
| 2 | అస్సాం | – | 2 | – | – | 2 |
| 3 | బీహార్ | – | 2 | 2 | 1 | 5 |
| 4 | గుజరాత్ | – | – | – | 1 | 1 |
| 5 | జమ్మూకాశ్మీర్ | – | 1 | – | – | 1 |
| 6 | కేరళ | 3 | 1 | 1 | 1 | 6 |
| 7 | మధ్యప్రదేశ్ | – | 2 | – | 1 | 3 |
| 8 | మహారాష్ట్ర | 4 | 3 | 2 | 1 | 10 |
| 9 | మిజోరం | – | – | – | 1 | 1 |
| 10 | రాజస్థాన్ | 5 | 1 | 2 | 1 | 9 |
| 11 | తెలంగాణ | – | 2 | 1 | 2 | 5 |
| 12 | త్రిపుర | – | – | – | 1 | 1 |
| 13 | ఉత్తర ప్రదేశ్ | 1 | 1 | – | – | 2 |
| | మొత్తం | **13** | **17** | **12** | **12** | **54** |
| పాల్గొన్న రాష్ట్రాలు (సభ్యులు) | | 16 (163) | 17 (186) | 19 (200) | 2 (228) | |

# పాడి రైతులకు ఉపయోగకరంగా మిల్క్ బూస్టర్ !

– డా. భార్గవి

మదనపల్లిలో ఏపిమాస్, సౌభాగ్య బయోటెక్ సంయుక్త ఆధ్వర్యంలో 'వంజుల' అనే 'మిల్క్ బూస్టర్ 'ను (పాలఉత్పత్తిని సహజంగా పెంచే పౌష్టికాహారం) 2025 జులై 22న ప్రారంభించారు. ఏపిమాస్ ప్రతినిధులు సౌభాగ్య బయోటెక్ వారితో మాట్లాడి ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఎఫ్.పి.ఓలకు యం–టమాటా ఫెడరేషన్ ద్వారా ఈ వంజుల మిల్క్ బూస్టర్ నేరుగా ఉపయోగపడాలని నిర్ణయించారు. ఇలా నేరుగా కంపెనీతో మాట్లాడడం వలన



70% ధర తగ్గి రైతులకు లాభం చేకూరింది. మిల్క్ బూస్టర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఏపిమాస్, సౌభాగ్య బయోటెక్ సిబ్బంది, యం–టమాటలో సభ్యులుగా వున్న ఎఫ్.పి.ఓ ల పాలక వర్గ సభ్యులు, ఎఫ్.పి.ఓల సి.ఈ.ఓ లు పాల్గొన్నారు.

పీలేరు, కలికిరి, కురబలకోట, వాల్మీకిపురంలలోని 20 మంది పాడి రైతుల పశువుల మీద వంజుల అనే మిల్క్ బూస్టర్ ప్రక్రియను 20 రోజుల పాటు ప్రయోగాత్మకంగా పరిశీలించారు. ఈ మిల్క్ బూస్టర్‌ను వాడక ముందు 5 రోజులు, వాడిన 10 రోజులు, వాడకం ఆపేసిన చివరి 5 రోజులు పాల ఉత్పత్తి , ఫ్యాట్ (కొవ్వు పదార్థం), ఎస్ఎన్ఎఫ్ (సాలిడ్ నాట్ ఫ్యాట్) వివరాలను నమోదుచేసి ఈ మిల్క్ బూస్టర్ ఉపయోగాలను రైతులకు తెలిసేలా చేయడం జరిగింది.

**ఫ్యాట్ , ఎస్ ఎన్ ఎఫ్**

**1. ఫ్యాట్ :** ఇది పాలలో ఉన్న కొవ్వు పదార్థం. పాలలో ఫ్యాట్ శాతం ఎక్కువగా ఉంటే, పాలు చిక్కగా, పోషక విలువలతో ఉంటాయి. పాలలో కొవ్వు శాతాన్ని ఫ్యాట్ పర్సంటేజ్ అనే మాటతో సూచిస్తారు.

**2. ఎస్ ఎన్ ఎఫ్ :** ఇది పాలలోని కొవ్వు పదార్థం కాకుండా ఖనిజాలు, ప్రోటీన్లు, ఇతర ఘన పదార్థాలను సూచిస్తుంది. ఎస్ఎన్ఎఫ్ పర్సంటేజ్ అనే మాటతో దీనిని సూచిస్తారు.

పాల నాణ్యతను కొలిచే రెండు ముఖ్యమైన అంశాలు ఇవే. ఫ్యాట్, ఎస్ ఎన్ ఎఫ్ బాగా ఉంటే ఆ పాలు ఆరోగ్యకరంగా, నాణ్యంగా వున్నాయని అర్థం.

**ముఖ్యమైన ఉపయోగాలు**

1. పాల ఉత్పత్తి పెరుగుతుంది: వంజుల మిల్క్ బూస్టర్ వాడిన పశువులలో 20–30% పాల ఉత్పత్తి పెరుగుతుంది.
2. పశువుల ఆరోగ్యం మెరుగవుతుంది: అవసరమైన పోషకాలు అందించి శరీర బలాన్ని పెంచుతుంది.
3. ఆరోగ్యకరమైన పాల ఉత్పత్తి : పాలు మంచి నాణ్యతతో చిక్కగా, ఎక్కువ కొవ్వు శాతం కలిగి ఉంటాయి.
4. రోగనిరోధక శక్తి పెరుగుతుంది: పశువులు అనారోగ్యానికి తక్కువగా గురి అవుతాయి.
5. జీర్ణశక్తి మెరుగుదల: మేత సులభంగా జీర్ణమవుతుంది
6. ప్రసవాల మధ్య గడువు తగ్గుతుంది : పశువుల పునరుత్పత్తి సామర్థ్యం మెరుగవుతుంది.
7. హార్మోన్ల సమతుల్యత కాపాడుతుంది: పాల ఉత్పత్తికి అవసరమైన హార్మోన్లను సమతుల్యంగా ఉంచుతుంది.
8. మేత నుండి ఎక్కువ పోషకాలను గ్రహిస్తుంది
9. పశువుల శరీర బరువు నియంత్రణలో ఉంటుంది : అధిక కొవ్వు కణాలు పేరుకోకుండా ఆరోగ్యంగా పెరుగుతాయి.

■

నిజమైన ఆనందానికి చిరునామా నీ తోడ్పాటుతో సంతోషంగా జీవించేవారి కళ్లలో చిందే చిరునవ్వు

# ఇంటర్న్‌షిప్ ద్వారా విద్యార్థినుల సమాజ సేవ

– భవాని, జాహ్నవి



తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఎంఎస్‌సి సామాజిక ఆరోగ్యం, పోషణ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎనిమిది మంది విద్యార్థినులు హైదరాబాదులోని ఏపిమాస్ ప్రధాన కార్యాలయంలో, మదనపల్లె కార్యాలయంలో మూడు నెలల పాటు ఇంటర్న్‌షిప్ చేశారు. ఈ ఇంటర్న్‌షిప్ సమయంలో వారు పట్టణ పోషణ పథకం, నీరు, పారిశుధ్యం, పరిశుభ్రత (వాష్), 'రాయలసీమ వాటర్ ఇనిషియేటివ్స్' ఆర్ డబ్ల్యు ఐ) వంటి ప్రధాన ప్రాజెక్టులలో చురుకుగా పాల్గొన్నారు.

హైదరాబాదులో పట్టణ పోషణ పథకం అమలు చేసే మెహదీపట్నం, కార్వాన్ ప్రాంతాలలో విద్యార్థినులు గృహ సందర్శనలలో పాల్గొని, తల్లులతో, పిల్లలతో ప్రత్యక్షంగా సంభాషించారు. అంతేగాక, ఋతు పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా విప్రో సంస్థ తయారుచేసిన ఋతు పరిశుభ్రత కిట్లను కిశోర బాలికలకు పంపిణీ చేసే కార్యక్రమంలో కూడా భాగస్వాములయ్యారు. నీరు, పారిశుధ్యం, పరిశుభ్రత పథకంలోని కార్యక్రమాల్లో భాగంగా స్వయం సహాయ సంఘాల మహిళలతో జరిగిన సమావేశాలకు హాజరయ్యారు.

మూడు సంవత్సరాలుగా అమలులో ఉన్న పట్టణ పోషణ పథకం ప్రభావాన్ని అంచనా వేయడానికి నిర్వహించిన 'ఎండ్‌లైన్ సర్వే'లో ఈ విద్యార్థినులు కీలకపాత్ర పోషించారు. గర్భిణులు, పాలిచ్చే తల్లులు, రెండు సంవత్సరాల లోపు వయస్సు కలిగిన చిన్నపిల్లల (మాతా శిశు) ఆరోగ్యం, పోషణ సంబంధిత అవగాహన, ఆచరణలు, వారి ప్రవర్తనల్లో వచ్చిన మార్పులను అంచనా వేయడం ఈ సర్వే ముఖ్య ఉద్దేశం. సముదాయ స్థాయిలో వచ్చిన మార్పులను, లోటుపాట్లను గుర్తించి భవిష్యత్తు ప్రణాళికలకు దోహదపడేలా చేయడం కూడా ఈ సర్వే మరొక ముఖ్య ఉద్దేశం. ఈ సర్వే నిర్వహణలో పాల్గొన్న ఈ విద్యార్థినులు కిశోర బాలికలు ఋతుక్రమ సమయంలో పాటిస్తున్న పద్ధతులు, వారి ఆహారపు అలవాట్లను అడిగి తెలుసుకున్నారు.

ఈ సమాచార సేకరణను నాణ్యతతో నిర్వహించేందుకు ప్రాజెక్ట్ సలహాదారు ఆధ్వర్యంలో మూడు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ శిక్షణలో విద్యార్థినులకు మాతాశిశు సంరక్షణ, ప్రశ్నావళి వినియోగం, ఫ్లిప్‌బుక్‌ల ద్వారా సమాచార మార్పిడి వంటి అంశాలపై అవగాహన కల్పించబడింది. విద్యార్థినులు మాక్ ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యాసకులుగా, పరిశోధకులుగా, స్పందకులుగా పాత్రలు పోషిస్తూ ప్రాక్టికల్ అనుభవం పొందారు. తద్వారా వారు క్షేత్రస్థాయిలో మరింత ఆత్మవిశ్వాసంతో పని చేయగలిగే విధంగావారికి శిక్షణ యివ్వబడింది.

ప్రశ్నావళి లోని స్పష్టతను, సంభావ్యత, అనుకూలతలను అంచనా వేసేందుకు, పట్టణ పోషణ పథకం అమలు

**ఇతరుల కష్టసుఖాలలో నీవు తోడుగా నిలిస్తే నీ కష్టసుఖాలలో వారు నీకు తోడుగా నిలుస్తారు**

కాని ప్రాంతాలలో క్షేత్రస్థాయి పరీక్ష నిర్వహించబడింది. ఈ దశలో పరిశోధకుల నిర్వాహక సామర్థ్యం, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలు, సామాజిక స్పందన వంటి అంశాలపై అభిప్రాయం సేకరించబడింది. వాటి ఆధారంగాస్థానిక పరిస్థితులకు అనుగుణంగా ప్రశ్నావళిలో మార్పులు జరిగాయి.

ఈ ఇంటర్న్‌షిప్ ద్వారా విద్యార్థినులు ప్రాజెక్ట్ స్వభావాన్ని, ప్రభావాన్ని అర్థం చేసుకొని, ప్రామాణికమైన సమాచార సేకరణలో నైపుణ్యం సంపాదించడంతో పాటుగా అంగన్వాడి టీచర్లు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలతో ప్రత్యక్షంగా పని చేసి వారి అనుభవాన్ని పెంపొందించుకో గలిగారు. ఇది వారి వృత్తిపరమైన అభివృద్ధికి మేలైన మౌలిక ఆధారంగా నిలుస్తుంది.

మదనపల్లెలో ఇంటర్న్ షిప్ చేసిన విద్యార్థులు సేంద్రియ, సహజ వ్యవసాయ పద్ధతులను పాటించడంలో రైతులకు అవగాహన కల్పించారు. పాలకూర, తోటకూర, ముల్లంగి, కాకరకాయ, మెంతులు, గోకరకాయ, బీరకాయ, బెండకాయ మొదలగు విత్తనాలు ఉన్న కిట్లను వారు గ్రామస్తులకు పంపిణీ చేశారు.

ఆ విద్యార్థినులు సుమారు 300 కుటుంబాలను సందర్శించి, వారిలో ఎంతమంది గర్భవతులు, బాలింతలు, కిశోర బాలికలు ఉన్నారో తెలుసుకున్నారు. ఇంతేకాకుండా ఎంతమంది మరుగు దొడ్డి, నీటి వసతులు కలిగి ఉన్నారో గుర్తించారు. అంగన్‌వాడి కేంద్రాలలో నమోదు చేసుకున్న గర్భవతుల మాతా శిశు సంరక్షణ కార్డులో పొందుపరచిన బరువు, ఆరోగ్య తనిఖీ, రక్తంలో హిమోగ్లోబిన్ శాతాన్ని దృష్టిలో పెట్టుకొని వారి ఆహారపు అలవాట్లను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడి కేంద్రంలో "సామూహిక అన్నప్రాసన" కార్యక్రమాన్ని నిర్వహించి, చిన్నపిల్లల ఆరోగ్యానికి ఉపయోగపడే పోషకాహార మిశ్రమాన్ని , మునగ ఆకు పొడిని తయారు చేసి చూపించారు.

ఇంటర్న్ షిప్ ముగింపు సమయంలో విద్యార్థినులు మూడునెలల పాటు తాము నిర్వహించిన కార్యక్రమాల విశేషాలను, తాము నేర్చుకున్న అంశాలను వివరించారు. ■

# రజితోత్సవ ప్రేరణ

(8వ పేజీ తరువాయి )

అనంతరం ఆ విషయాలను ఆ బృందాలు అందరికీ వివరించాయి. ప్రతి బృంద వివరణ తరువాత శ్రీ సి.ఎస్. రెడ్డి, ఇతర ముఖ్యులు అవసరమైన సలహాలు, సూచనలు యిచ్చారు.

రెండు రోజుల కార్యక్రమానికి ముగింపుగా శ్రీ సి.ఎస్. రెడ్డి ప్రసంగిస్తూ, ఏపిమాస్ 24 వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమాన్ని మరింత ఉత్సాహపూరితంగా, విజయవంతంగా నిర్వహించినందుకు అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయన ప్రసంగంలోని ముఖ్యాంశాలు:

- ఏపిమాస్ బోర్డు డైరెక్టర్ల నుంచి చక్కని సలహాలు, సూచనలు లభించాయి. ఇవన్నీ ఏపిమాస్ విజన్ 2030 పునః సమీక్ష భాగం అవుతాయి.
- ఈ కార్యక్రమంలో సిబ్బంది ఎంతో క్రియాశీలంగా పాల్గొన్నారు. వారి సమీక్ష, రెండు రోజుల కార్యక్రమంలో యిచ్చిన సూచనలు లక్ష్య సాధనకు ఎంతో దోహదం చేసేవిగా వున్నాయి.
- మొత్తం కార్యక్రమం స్పష్టమైన, నిజాయితీతో కూడిన, పారదర్శకమైన, సహభాగస్వామ్య చర్చలకు వేదికయింది.
- ముఖ్యంగా గమనించవలసిన విషయం అంశం ఏమిటంటే ఏపిమాస్ బృందం అన్ని రకాల సవాళ్లను ఎదుర్కొనడానికి, కొత్త కార్యక్రమాలను చేపట్టడానికి సిద్ధంగా ఉంది.
- ఏపిమాస్‌తో పాటు అన్ని సామాజిక సంస్థలకు నూతన సాంకేతిక పరిజ్ఞాన వినియోగం సంస్థ అభివృద్ధి కోసం చాలా ముఖ్యం.

ఈ విధంగా ఏపిమాస్ 24వ వార్షికోత్సవ రెండురోజుల సమావేశాలు విజయవంతంగా ముగిశాయి. సిబ్బంది అందరూ చాలా ఉత్సాహంగా పాల్గొని, 2030 సంవత్సరానికల్లా సంస్థ లక్ష్యాలను సాధించే ప్రేరణ పొందారు. ■

**అభిప్రాయాలూ వాస్తవాలు కావు ; సహృదయంతో , సదవగాహనతో ఆలోచిస్తేనే నిజం నిగ్గుతేలేది**

## ఏపిమాస్ ... మాస్ ... మాస్ !

ఎవరమ్మా మహిళల మార్గదర్శి
రైతన్నల సమూహ శక్తి
ఏపిమాస్...మాస్..మాస్ !

సహకార వ్యవస్థల స్వాతంత్ర స్ఫూర్తి
ప్రభుత్వ విధానాల అపురూప శిల్పి
మహిళా సాధికారత సంచిక రూపకర్త
సంఘాల, ఎఫ్పిఓల కరదీపికల సృష్టికర్త
ఏపిమాస్...మాస్..మాస్
ఏపిమాస్...మాస్..మాస్ !

పర్యావరణ సహిత గ్రామాలకై కృషి
ప్రకృతి వ్యవసాయం కోసం తపిస్తున్న ఋషి
రాయలసీమను రతనాల సీమగా మార్చే శక్తి
రైతన్ననూ రాజును చేసే యుక్తి
ఏపిమాస్...మాస్..మాస్
ఏపిమాస్...మాస్..మాస్ !

కరోనాకు ఎదురెళ్లి సాయమందించిన చేయూత
త్రాగు నీటి పరిశుభ్రత, పారిశుధ్య ఆవశ్యకత
అందరికీ తెలియజేస్తున్న సంస్థ
కౌమార బాలికలకు, గర్భిణులకు, బాలింతలకు
తగిన పోషకాహారాలపై అవగాహన కల్పిస్తున్న వ్యవస్థ

ఎవరమ్మా మహిళల మార్గదర్శి
రైతన్నల సమూహ శక్తి
ఏపిమాస్...మాస్..మాస్
ఏపిమాస్...మాస్..మాస్ !

(ఈ గేయ రచయిత ఏపిమాస్ ఫైనాన్స్ డైరెక్టర్ శ్రీ శ్రీనివాస రెడ్డి ... ఆయనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏ ఐ) సహకారంతో ఈ గేయానికి స్వరాలు సమకూర్చారు)

## చిగురించిన ఆశ !

(1వ పేజీ తరువాయి)

*భూమాత పులకించేలా జోరు వానలు కురిపిస్తున్నాయ్!!*
*ఏమా కమనీయ దృశ్యం!*

*ఎండి బీటలువారిన పొలాలు*
*పచ్చని చిరుమొలకలతో చిద్విలాసంగా చూస్తున్నాయ్ !*
*మెట్ట పొలాలలో ఆరుగాలం కాయకష్టంచేసే చేతులు*
*ఆకాశం అందించిన అమోఘ వరంతో*
*మళ్ళీ జవజీవాలు పుంజుకున్నాయ్ !*

*అంతటా గగన మాంత్రికుడు గుప్పించిన*
*ఆనందం, సంరంభం !!*

*అవునవును ... వాన నీరు తోడుగా, ఆశాభావం అండగా,*
*మరిన్ని సత్ఫలితాల సాధనకు నడుంబిగించి*
*ఏపిమాస్ సారథ్యంలో 'రాయలసీమ జలజీవని'*
*రైతులతో చేయి కలిపి , పొలాలలతో పొత్తుకలిపి*
*ముందడుగు వేస్తున్నది ... మురిపెంగా, ముచ్చటగా*
*మరింత ఉత్సాహంగా, దృఢంగా !!*

(ఏపిమాస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీమతి ఎన్ రమాదేవి ఆంగ్ల గేయానికి స్వేచ్ఛానువాదం. ఈ గేయానికి ఏపిమాస్ ఫైనాన్స్ డైరెక్టర్ శ్రీ శ్రీనివాసరెడ్డి స్వరాలు సమకూర్చారు)

■

## ఇక స్వర్ణ ప్రస్థానం.... !

(1వ పేజీ తరువాయి)

మహోజ్వల భవితకు మార్గదర్శనం చేస్తూ, ఆనందాల వెల్లువగా, అగ్రగామిగా నిలుస్తూ, ఇక ఏపిమాస్ స్వర్ణ ప్రస్థానం మహోజ్వలంగా సాగాలని ఆకాంక్షిద్దాం అందరం !!

(ఏపిమాస్ విశ్రాంత ఫైనాన్స్ డైరెక్టర్ శ్రీ ఏ వి రాజన్ ఆంగ్ల గేయానికి స్వేచ్ఛానువాదం)

■

**సమస్యలనుంచి పారిపోతుంటే ఏనాడూ గెలవలేవు , ఎదురు నిలిచి ఎదుర్కోవడమే విజయ రహస్యం !**

# సైబర్ నేరగాళ్ళ సరికొత్త మోసాలు : బహుపరాక్ !

*సైబర్ మోసాలకు అంతే లేకుండా పోతోంది. ప్రతిరోజూ ఎవరో ఒకరు సైబర్ మోసానికి గురవుతూనే ఉన్నారు, లక్షల రూపాయలు నష్టపోతున్నారు. ఈ సైబర్ మోసాలపై ప్రజల్లో అవగాహన తక్కువగా ఉండడంతో రోజూ ఎవరో ఒకరు ఈ సైబర్ మోసానికి బలవుతున్నారు. ఇప్పటివరకు వాట్సాప్ వేదికగా ఇలాంటి మోసాలు జరుగుతుంటే, ఇప్పుడు 'టెలిగ్రామ్' ద్వారా ఎక్కువగా జరుగుతున్నాయి. దేశ, విదేశాలకు చెందిన సూత్రధారులు ఉంటున్నారని పోలీసులు గుర్తిస్తున్నారు. తక్కువ మొత్తం మోసపోయిన వారు ఫిర్యాదు చేయడానికి ముందుకు రావడం లేదని, లక్షల్లో డబ్బులు పోగొట్టుకున్న వారే ఫిర్యాదు చేసేందుకు వస్తున్నట్లు పోలీసులు పేర్కొంటున్నారు. టెలిగ్రామ్‌లో చేరేందుకు, ఇతరులను కాంటాక్టు అయ్యేందుకు, గ్రూప్‌లో చేర్చుకునేందుకు అవకాశాలు సులువుగా వుండటం ఒక కారణం. హైదరాబాదులోని మూడు కమిషనరేట్ల పరిధిలో నమోదవుతున్న సైబర్ నేరాల్లో ఇలాంటి మోసాలే ఎక్కువగా ఉంటున్నాయి.*

♦♦♦♦♦

**కేం**ద్ర ప్రభుత్వ పథకాలైన పీఎం కిసాన్, ముద్ర లోన్స్, సూర్యఘర్ వంటి పథకాల పేరుతో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. 'ఇది కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన కొత్త పథకం. ఇప్పుడే దరఖాస్తు చేసుకోండి. మీకు రూ. 50 వేల రాయితీ' అంటూ ఆకర్షించి ఖాతాలను కొల్లగొడుతున్నారు. ఆయా పథకాలకు దరఖాస్తు చేసుకున్న వారిని ఎంచుకొని వారికి సైబర్ వల విసురుతున్నారు. ఇలాంటి మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సైబర్ క్రైం పోలీసులు సూచిస్తున్నారు. ఆయా పథకాల పేరుతో వచ్చే మెసేజ్‌లలోని లింకులను క్లిక్ చేయవద్దని పేర్కొంటున్నారు. ఓటీపీలు చెబితే మోసపోయే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

**రూ. 61.52 లక్షలు కొట్టేశారు ...**

ట్రేడింగ్‌లో వర్చువల్‌గా రూ. కోట్లల్లో లాభాలు వచ్చినట్లు చూపించిన సైబర్ నేరగాళ్లు హైదరాబాద్ నగరానికి చెందిన ఒక వ్యాపారి నుంచి రూ. 61.52 లక్షలు కొట్టేశారు. సైబర్ క్రైమ్ డీసీపీ ధార కవిత తెలిసిన వివరాల ప్రకారం... నగరానికి చెందిన 40 ఏళ్ల వ్యాపారికి ఒక వాట్సాప్ మెసేజ్ వచ్చింది. దాన్ని ఓపెన్ చేసి ఫేస్‌బుక్ ఫాలో చేయగా, జీ-6 నువామా వెల్త్ గ్రూపు నుంచి వచ్చినట్లు గుర్తించాడు. ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే అనతి కాలంలోనే అధిక లాభాలు వస్తాయని మెసేజ్ సారాంశం. వెంటనే అక్కడున్న మొబైల్ నంబర్లలో బాధితుడు సంప్రదించాడు.

నువామా వెల్త్ గ్రూపు నుంచి స్పందించిన వ్యక్తులు ఒక లింకు పంపించారు. అందులో వివరాలు నమోదు చేసిన వెంటనే కొంతమంది వ్యక్తులు లైన్‌లోకి వచ్చారు. వ్యాపారం, పెట్టుబడుల గురించి వివరించారు. అనంతరం బాధితుడు ఐపీఓ షేర్లను కొనుగోలు చేశాడు.

ప్రారంభంలో మంచి లాభాలు రావడంతో వాటిని విత్‌డ్రా చేసుకుంటూనే రూ. 61.52 లక్షలు పెట్టుబడులు పెట్టాడు. ఏకంగా రూ. 2.99 కోట్లు ఖాతాలో ఉన్నట్లు వర్చువల్‌గా కనిపించింది. ఆ డబ్బులోంచి బాధితుడు రూ. 56 లక్షలు విత్‌డ్రా చేసుకోవాలని ప్రయత్నించగా రాలేదు. ఇదేంటని ప్రశ్నించగా, మొత్తం డబ్బుపై రూ. 20 శాతం కమీషన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. లేదంటే విత్‌డ్రా చేయడం కుదరదని, పెట్టుబడులు కొనసాగించాలని అన్నారు. ఉన్న డబ్బులోంచి కమీషన్ తీసుకుని, మిగతాది ఇవ్వాలని చెప్పినా వినలేదు. ఇదంతా సైబర్ మోసం అని ఆలస్యంగా గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**నీ కంటె ఎంత గొప్పవారితో వున్నావని కాదు, వారు నీకు అండగా నిలిచే వారో కాదో ఆలోచించుకో**

**అరగంటలో ఐదు వేల లాభం !**

రూ.10వేల పెట్టుబడికి అరగంటలో రూ.5వేలు లాభం ఇచ్చారు. ట్రేడింగ్‌పై నమ్మకం పెంచి హైదరాబాద్‌కు చెందిన విద్యార్థిని నుంచి రూ.1.27 లక్షలు కొట్టేశారు. సైబర్ క్రైమ్ పోలీసుల కథనం ప్రకారం నగరానికి చెందిన 24 ఏళ్ల విద్యార్థినిని జీపీ డిస్కషన్ 063 గ్రూపులో యాడ్ చేశారు. గోద్రేజ్ ప్రాపర్టీస్‌లో పెట్టుబడులు పెడితే అరగంటలోనే అధిక లాభాలు వస్తాయని అందులో మెసేజ్ పెట్టారు. రోజుకు తక్కువలో తక్కువ రూ.5వేలు సంపాదించుకోవచ్చు అని బురిడీ కొట్టించారు. ఇదేదో బాగుందని నమ్మిన బాధితురాలు ముందుగా రూ.10 వేలు పెట్టుబడి పెట్టింది. అరగంటలో రూ.5 వేలు లాభంతో రూ.15 వేలు ఆమె ఖాతాలో జమ చేశారు. ఆ తర్వాత రూ.31,572 పెట్టుబడి పెడితే అరగంటలో రూ.70వేలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. చెప్పినట్లుగానే జమ చేశారు. దీంతో ఉత్సాహంగా ఆమె విడతల వారీగా రూ.1,27,354 చెల్లించింది. సైబర్ నేరగాళ్లు ఆ మొత్తాన్ని కాజేసి ఉడాయించారు. బాధితురాలు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

**అడ్రస్ అప్‌డేట్ చేయాలంటూ ...**

బ్యాంకు అధికారినంటూ ఫోన్ చేసిన సైబర్ నేరగాడు అడ్రస్ అప్‌డేట్ పేరుతో రూ.3.92 లక్షలు కాజేశాడు. ముషీరాబాద్‌కు చెందిన ప్రభుత్వ ఒక ఉద్యోగి(59)కి ఈనెల 4న 9123317117 నంబర్ నుంచి ఫోన్ చేసిన సైబర్ నేరగాడు తాను ఎస్‌బ్యాంక్ రిలేషన్‌షిప్ మేనేజర్‌నని పరిచయం చేసుకున్నాడు. ఖాతా వివరాలు చెప్పడంతో పాటు అడ్రస్‌లో తప్పు ఉందని, దానిని సరి చేసుకోవాలని సూచించాడు. అందుకోసం ధ్రువపత్రాలు పంపాలని సూచించాడు. అతడు చెప్పిన విధంగా బాధితుడు పత్రాలను పంపాడు. తర్వాత కొద్ది సేపటికి సైబర్ నేరగాడు ఏపీకే ఫైల్‌ను పంపాడు. దీంతో ఫోన్ స్విచ్ఛాఫ్ అయింది. ఆ సమయంలో బాధితుడి ఫోన్‌నుంచి సైబర్ నేరగాళ్లు రూ.3.92 లక్షలు కాజేశారు. ఈ విషయం గుర్తించిన బాధితుడు వెంటనే సైబర్ క్రైం పోలీసులకు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశాడు.

**ఆన్‌లైన్‌లో రూమ్ కోసం వెతికితే ...**

ఆన్‌లైన్‌లో రిసార్ట్ రూములు బుక్ చేసుకునేందుకు ప్రయత్నించిన మహిళకు సైబర్ నేరగాళ్లు కుచ్చుటోపీ పెట్టారు. నకిలీ సందేశాలు పంపుతూ రూ.1.33 లక్షలు కాజేశారు. సికింద్రాబాద్‌ప్రాంతానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగిని ఆన్‌లైన్‌లో రిసార్ట్ కోసం వెతుకుతుండగా చీరాల సమీపంలో 'మైరా గోల్డెన్ రిసార్ట్' గురించిన ప్రకటన కనిపించింది. ప్రకటనలో ఉన్న నంబర్‌ను సంప్రదించింది.

ఆమెతో ఫోన్‌లో మాట్లాడిన సైబర్ నేరగాడు రోజుకు రూ.4 వేలకు రూమ్ కేటాయిస్తామని, అందుకోసం ముందుగా రూ.1 ఆన్‌లైన్‌లో పంపాలని కోరాడు. ఆ మాటలు నమ్మిన బాధితురాలు అతడు సూచించిన ఖాతాకు రూ.1 పంపింది. తర్వాత ఫోన్ చేసిన వ్యక్తి ముందుగా రూ.4 వేలు చెల్లిస్తేనే బుకింగ్ పూర్తవుతుందని చెప్పడంతో ఆ డబ్బు కూడా పంపింది. కొద్దిసేపటికి ఆమె ఖాతాలో రూ.3,990, రూ.39,990 జమ అయినట్లు ఫోన్‌కు సందేశాలు వచ్చాయి. వెంటనే ఫోన్ చేసిన వ్యక్తి తాము ఇతరులకు పంపాల్సిన డబ్బు మీ ఖాతాలో జమ అయిందని, డబ్బు తిరిగి పంపాలని ప్రాధేయపడ్డాడు. బాధితురాలు బ్యాంకు ఖాతా చెక్ చేసు కోకుండా అతడు చెప్పిన ఖాతాకు ఆ డబ్బులను పంపింది. జమ కాలేదని మరోసారి ఫోన్ చేసి ఆ వ్యక్తి కోరడంతో గుడ్డిగా మళ్లీ అతడు సూచించిన ఖాతాకు డబ్బు పంపింది. ఇలా పలుమార్లు రూ.1.33 లక్షలు పంపిన తర్వాత ఆ వ్యక్తులు సైబర్ నేరగాళ్లని గుర్తించి సైబర్ క్రైం ఠాణాలో ఫిర్యాదు చేసింది.

**ఔషధంకోసం వెదుకులాటలో 2లక్షలు స్వాహా**

ఔషధాల కోసం ఆన్‌లైన్‌లో వెదికి సైబర్ నేరగాళ్ల మోసానికి ఓ విద్యార్థి గురయ్యాడు. రూ.2.25 లక్షలు పోగొట్టుకున్నాడు. సైబర్‌క్రైం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నగరానికి చెందిన 23 ఏళ్ల విద్యార్థి ఈనెల 4న ఓ మెడిసిన్ కోసం గూగుల్‌లో వెదికాడు. ఆ మెడిసిన్ ధర యూనిట్‌కు దాదాపు రూ.5000గా ఉంది. హోల్‌సేల్ దుకాణాల్లో అయితే ధర తగ్గుతుందని వాటి కోసం వెదుకుతూ, కొన్ని ఫోన్ కాల్స్ చేశాడు. ఆ ఔషధాన్ని హోల్‌సేల్ ధరకు

అమ్ముతామని ఓ వ్యక్తి మాట్లాడాడు. దాని ధర తగ్గదని చెప్పడంతో బాధితుడు తనకు అవసరమైన ఐదు యూనిట్ల మెడిసిన్ కోసం రూ.25 వేలను వారు చెప్పిన బ్యాంక్ ఖాతాకు బదిలీ చేశాడు. మెడిసిన్ డెలివరీ కాకపోవడంతో ఆ నంబర్‌కు ఫోన్‌చేసి ఆర్డర్‌ను రద్దు చేయాలని అభ్యర్థించాడు. అవతలి వ్యక్తితో ఫోన్ మాట్లాడుతుండగానే తన తల్లి ఫొటో ఉన్న నంబర్ నుంచి ఒక ఏపీకే లింక్ వచ్చింది. బాధితుడు దాన్ని క్లిక్ చేయగానే బ్యాంకు ఖాతా నుంచి రూ. 2.25 లక్షలు డెబిట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

**తమ్ముడి ఫొటోను డీపీగా పెట్టి ...**

సౌదీలో ఉంటున్న తమ్ముడి ఫొటోను డీపీగా పెట్టి, హైదరాబాద్‌లో ఉంటున్న అన్న నుంచి సైబర్ నేరగాళ్ళు రూ.1.19 లక్షలు కొల్లగొట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి సౌదీ వెళ్లాడు. అతని అన్న హైదరాబాద్‌లోనే ఉంటున్నాడు. ఇటీవల అన్నకు తమ్ముడి పేరుతో ఫేస్‌బుక్ మెసేజ్ వచ్చింది. అన్న భార్య (వదిన) మెజేస్ చూసి రిప్లై ఇవ్వగా, అవతలి వ్యక్తి వాట్సాప్ నంబర్ అంటూ ఫోన్ నంబర్ ఇచ్చాడు. వాట్సాప్ ఖాతాలో మరిది ఫొటోనే ఉండటంతో ఆమె నమ్మింది. అన్నయ్యకు డబ్బులు పంపాలంటూ అవతలి వ్యక్తి బ్యాంకు ఖాతా వివరాలు సేకరించాడు. కొద్దిసేపటి తర్వాత వెస్ట్రన్ యూనియన్ ద్వారా డబ్బు బదిలీ చేసినట్లు రశీదును పంపాడు. 24 గంటల్లో ఆ డబ్బు అన్నయ్య ఖాతాలో జమ అవుతుందని చెప్పాడు. అయితే, ఒక గంట తర్వాత మరోసారి అదే నంబర్ నుంచి ఫోన్ వచ్చింది.

తన మరిది ఫోన్ చేశాడని భావించిన ఆమె ఫోన్ ఎత్తింది. వేరే వ్యక్తి ఫోన్‌లో మాట్లాడాడు. సౌదీలోని భారత ఎంబసీ నుంచి మాట్లాడుతున్నానని, వీసా గడువు ముగిసిన కారణంగా మీ మరిది ఎంబసీలో చిక్కుకున్నాడని, దాన్ని పునరుద్ధరించడానికి వెంటనే డబ్బు పంపాలని చెప్పాడు. డబ్బు పంపాల్సిన ఖాతా వివరాలిచ్చాడు.

ఈ విషయాన్ని బాధితురాలు తన భర్తకు చెప్పింది. నేరగాడు చెప్పిన ఖాతాలో రూ.1.19 లక్షలు బదిలీ చేసింది. ఆ తర్వాత తమ్ముడి కోసం అన్న అదే నంబర్‌కు ఫోన్ చేయగా ఎవరూ స్పందించలేదు. తమ వద్ద ఉన్న మరో నంబర్‌కు ఫోన్ చేస్తే తన తమ్ముడు సౌదీలో ఇంట్లోనే ఉన్నట్లు తేలింది. మోసపోయినట్లు గుర్తించిన బాధితులు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు.

**రోజుకు 3 గంటలే పని ... 3 నెలలకు 50 వేలు !**

రోజుకు కేవలం 2–3 గంటలు మాత్రమే పార్ట్‌టైమ్ పనిచేయండి.. 3 నెలల్లో రూ. 50వేలు సంపాదించండి.. అలాగే పెట్టుబడి పెడితే తక్కువ సమయంలో రెట్టింపు లాభం ఇస్తాం..' అంటూ నిరుద్యోగికి వల విసిరి రూ.10.19 లక్షలను సైబర్ క్రిమినల్స్ కొల్లగొట్టారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నగరంలోని ఓ బాధితునికి వచ్చిన వాట్సాప్ సందేశానికి స్పందించడంతో రహేజా కార్పొరేషన్ పేరుతో గుర్తుతెలియని వ్యక్తి రిజిస్ట్రేషన్ లింకును పంపారు. అందులో రిజిస్టర్ కాగానే వెంటనే రూ.10వేలు బాధితుడి ఖాతాలో వేసి కొన్ని టాస్క్‌లు ఇచ్చారు. రియల్ ఎస్టేట్ సంస్థలకు రివ్యూలు రాస్తే ఆటోమేటిక్‌గా మీ ఖాతాలో డబ్బులు పడతాయని సైబర్ కేటుగాడు నమ్మించారు. మొదటి 20 టాస్క్‌లకు రూ. 500 చొప్పున డబ్బును బాధితుడి ఖాతాలో వేశారు. అందులో కొంతడబ్బును మీ పేరున కంపెనీలో పెట్టుబడులు పెడుతున్నామని, మీరు మరిన్ని పెట్టుబడులు పెడితే తక్కువ సమయంలోనే రెట్టింపు అవుతుందని కేటుగాడు నమ్మించారు.

అలా డబ్బును రెట్టింపుగా ఖాతాలో చూపించి విత్‌డ్రా అవకాశాలు కల్పించారు. నమ్మకం కుదిరాక రూ. లక్షల్లో పెట్టుబడులు పెట్టిస్తూ విడతల వారీగా ఆ మొత్తాన్ని రూ.10.19 లక్షలకు పెంచారు. ఆ తర్వాత విత్‌డ్రా ఆప్షన్ క్లోజ్ చేశారు. ఇదేంటని ప్రశ్నిస్తే మరిన్ని పెట్టుబడులు పెట్టాలని డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఆ కంపెనీ గురించి ఆరా తీయగా బోగస్ కంపెనీ అని తేలింది. దీంతో మోసపోయినట్లు గుర్తించి సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

**ఛానల్ చూస్తే రోజుకు రూ.10 వేలు**

పార్ట్‌టైం జాబ్‌లో భాగంగా వాట్సప్ ఛానల్‌ను వీక్షిస్తే

డబ్బులు ఇస్తామని నగరానికి చెందిన విద్యార్థినిని నమ్మించిన సైబర్ నేరగాళ్లు రూ.లక్ష కాజేశారు. సికింద్రాబాద్‌కు చెందిన విద్యార్థిని(24)కి పార్ట్‌టైం ఉద్యోగం పేరుతో టెలిగ్రామ్‌లో సందేశం వచ్చింది. 'ఇంట్లోనే కూర్చుని మా వాట్సప్ ఛానల్‌ను చూస్తూ రేటింగ్ ఇచ్చిన స్క్రీన్‌షాట్ పెడితే చాలు డబ్బు సంపాదించవచ్చు' అని దాని సారాంశం. ఆ గ్రూప్‌లో చేరినందుకు జాయినింగ్ బోనస్ అంటూ రూ.208 ఖాతాలో జమ చేశారు. తాము చెప్పిన విధంగా పెట్టుబడి పెట్టి పని చేస్తే రోజుకు రూ.10 వేల నుంచి రూ. 15 వేల వరకు సంపాదించవచ్చని నమ్మించారు. తర్వాత ఓ వెబ్‌లింక్ పంపారు. వారి మాటలు నమ్మిన విద్యార్థిని పలు దఫాలుగా రూ.లక్ష వారు సూచించిన ఖాతాలకు బదిలీ చేసింది. యాప్‌లో రూ.1.99 లక్షలు వచ్చినట్లు చూపిం చారు. ఆ డబ్బు విత్‌డ్రా చేసుకోవాలని ప్రయత్నించగా, రూ.1.99 లక్షలు డిపాజిట్ చేస్తే మొత్తం కలిపి చేతికి వస్తాయని సైబర్ నేరగాళ్లు చెప్పారు. దాంతో మోసపోయానని గ్రహించిన విద్యార్థిని సైబర్ క్రైం ఠాణాలో ఫిర్యాదు చేసింది.

**మరో టెలిగ్రామ్ వంచన ...**

నగరానికి చెందిన మహిళను సైబర్ నేరగాడు టెలిగ్రామ్ యాప్ ద్వారా పరిచయమై ఇంట్లో నుంచే పార్ట్ టైం జాబ్ చేయవచ్చని నమ్మించారు. తాను ఆన్‌లైన్‌లో పంపించే లింకులను క్లిక్ చేసి టాస్క్‌లను పూర్తి చేయాలన్నాడు. ఇందులో చేరడానికి మొదట కొంత డబ్బు చెల్లించాల్సి ఉంటుందన్నాడు. కొంత నగదు కూడా తీసుకున్నాడు. అతను చెప్పినట్లుగా లింకులను ఓపెన్ చేసి వీడియోలను చూసి లైక్‌లను, రివ్యూలను రాసింది. దీంతో ఆమెకు కొంత డబ్బు ఇచ్చాడు. ఇలా కొన్ని టాస్క్‌లు పూర్తి చేసిన తర్వాత పెద్ద మొత్తంలో డబ్బులు చెల్లిస్తే ఎక్కువ మొత్తంలో లాభాలు వస్తాయని నమ్మబలికారు. చివరిగా రూ.8.75 లక్షలను వసూలు చేశారు. ఆ తర్వాత నుంచి కేటుగాడు ఆ గ్రూపు నుంచి వైదొలగిపోయాడు. కొన్ని రోజుల తర్వాత మోసపోయానని తెలుసుకొని పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మరో వ్యక్తి కూడా టెలిగ్రామ్ గ్రూప్ ద్వారా పార్ట్‌టైం జాబ్ పేరుతో చేరి రూ.2.38 లక్షలను పొగొట్టుకున్నారు. టెలిగ్రామ్ గ్రూప్ ద్వారా పరిచయమైన సైబర్ నేరగాళ్లు మొదట చిన్న చిన్న టాస్క్‌లను ఇచ్చి, వాటికి డబ్బులు చెల్లిస్తూ నమ్మించారు. ఎక్కువ లాభాలు కావాలంటే అధిక మొత్తాన్ని డిపాజిట్ చేయాలని సూచించారు. దీన్ని నమ్మి ఆ వ్యక్తి వారు చెప్పినట్లుగా రూ.2.38లక్షలను కేటుగాళ్లకు పంపించారు. ఆ తర్వాత నుంచి అతడికి అందుబాటులో లేకుండా పోయారు. దీనిపై బాధితుడు సైబర్ క్రైం పోలీసులు ఫిర్యాదు చేశాడు.

**61.95 లక్షలు గోవిందా ...**

వృద్ధుడి అత్యాశే కొంప ముంచింది. సైబర్ కేటుగాడి మాయమాటలతో భారీగా నగదు పోగొట్టుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సదరు బాధితుడు డబ్బు సంపాదించాలని గత మార్చిలో బుల్ మార్కెట్ ద్వారా ఎక్స్‌పర్ట్స్ ప్రొ లిమిటెడ్ సంస్థలో రూ.21 వేలు మదుపు చేశాడు. తర్వాత ఆ సంస్థ ప్రతినిధినంటూ లైన్‌లోకి వచ్చిన వ్యక్తి తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలొచ్చేలా టిప్స్ చెబుతానని నమ్మబలికాడు. డాలర్లలో అంతర్జాతీయ స్టాక్ ట్రేడింగ్ గురించి చెప్పి బురిడీ కొట్టించాడు. రూ.లక్షల్లో మదుపు చేస్తే రూ.కోట్లలో లాభాలుంటాయని నమ్మించడంతో పాటు ప్రారంభంలో లాభాలు రుచి చూపించాడు. అలా రూ.61.95 లక్షలు మదుపు చేయించారు. 75 వేల అమెరికా డాలర్ల బ్యాలెన్స్ ఉన్నట్లు చూపి విత్ డ్రా చేసుకునే అవకాశం లేకుండా చేశారు. ఇంకా పెట్టుబడులు పెట్టాలని ఒత్తిడితో సైబర్ మోసమని గ్రహించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**కేరళ లాటరీ పేరుతో బురిడీ**

కేరళ లాటరీలో రూ. 5లక్షలు గెలిచారంటూ ఓ మహిళను నమ్మించిన సైబర్ క్రిమినల్స్ ఆమె ఖాతా నుంచి దశలవారీగా రూ.7.55 లక్షలు కొల్లగొట్టారు. నగరానికి చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగిని(54)కి ఏప్రిల్ 7న గుర్తుతెలియని వ్యక్తి ఫోన్‌చేసి తమవద్ద కేరళ లాటరీ టికెట్‌కొంటే ఏ రోజుకారోజే డ్రా తీసి విజేతలను ప్రకటిస్తామని నమ్మించాడు. దాంతో ఆమె ఆన్‌లైన్‌లో టికెట్ కొనుగోలు చేసింది. మరుసటిరోజు సదరు కేటుగాడు ఫోన్

## సైబర్ క్రైం పోలీసుల సూచనలు

- అపరిచిత లింకులను నమ్మవద్దు. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన దరఖాస్తుల కోసం అధికారిక వెబ్ సైట్ లను మాత్రమే ఉపయోగించాలి.

  (pmkisan.gov.in, mudra.org.in)
- వ్యక్తిగత సమాచారం షేర్ చేయవద్దు. బ్యాంక్ ఖాతా వివరాలు, ఓటీపీ, పాస్‌వర్డ్‌లను ఎవరితోనూ పంచుకోవద్దు.
- అపరిచిత కాల్స్ వస్తే 1930 నంబరుకు కాల్ చేయాలి. అదేవిధంగా www.cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలి.
- ఇలాంటి మోసాల గురించి కుటుంబ సభ్యులు, స్నేహితులకు తెలియజేసి సైబర్ మోసాల బారిన పడకుండా అవగాహన పెంచాలి.
- ప్రభుత్వ పథకాల సమాచారం కోసం www.gov.in, nic.in లాంటి అధికారిక డొమైన్‌లను మాత్రమే ఉపయోగించాలి.

చేసి మీరు లాటరీలో రూ.5లక్షలు గెలిచారని చెబుతూ ఓ లింకు పంపాడు. ఆ లింక్‌ను ఓపెన్ చేసిన మహిళ అందులో తాను కొనుగోలు చేసిన టికెట్ నంబర్ ఉండడంతో చూసి సంతోషపడింది. అయితే, ఆ డబ్బు మొత్తం రావాలంటే ముందస్తుగా కొన్ని పన్నులు చెల్లించాలంటూ బురిడీ కొట్టించి ఆమెనుంచి విడతలవారీగా రూ. 7.55 లక్షలు దోచేశారు. అయినా ఎంతకీ లాటరీ డబ్బులు ఖాతాలో జమ కాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించింది. సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది

**కోటి బిజినెస్ లోన్ ఇప్పిస్తామని ...**

రూ. కోటి బిజినెస్ లోన్ ఇప్పిస్తామని ఓ వ్యాపారి నెత్తిన శఠగోపం పెట్టిన సైబర్ నేరగాళ్లు అతని నుంచి రూ. 14.50 లక్షలు కొల్లగొట్టారు. మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. డీసీపీ కవిత తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన 36 ఏళ్ల వ్యక్తి ట్రావెల్ బిజినెస్ చేస్తుంటాడు. వ్యాపార రుణాలు ఇప్పిస్తామంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఫోన్ నంబర్లు కనిపించడంతో బాధితుడు సంప్రదించాడు. వ్యాపారాభివృద్ధికి రూ. కోటి రుణం ఇప్పిస్తానని హామీ ఇచ్చాడు. డాక్యుమెంట్స్ ఆన్‌లైన్‌లో తీసుకుని లోన్ ప్రాసెస్‌లో ఉందంటూ ప్రాసెసింగ్ ఫీజు కింద మొదట కొంత డబ్బు తీసుకున్నాడు. లోన్‌కు ఆమోదం లభించిందంటూ మరికొంత, బ్యాంకు చార్జీలు, ఇతర ఖర్చులు అంటూ విడతలవారీగా రూ. 14.50లక్షలు కొల్ల గొట్టాడు. అయినా లోన్ రాకపోవడంతో అతన్ని నిలదీయగా స్పందించడం మానేశాడు. దాంతో మోసపోయినట్లు గుర్తించి బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

**రూ.లక్షకు లక్షాముప్పై వేలు..**

రూ.లక్షకు ముప్పైవేలు అదనంగా ఇస్తాం. ఇండియన్ కరెన్సీ ఇస్తే లక్షా ముప్పైవేలు విలువ గల సౌదీ అరేబియా నగదు ఇస్తాం' అని రెండు లక్షలు తీసుకుని తెల్లకాగితాలు ఇచ్చారు. బేగంపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్‌లోని వారాసిగూడకు చెందిన పర్వేజ్ (58) ఆటో డ్రైవర్. కొద్దిరోజుల క్రితం చిలకలగూడ చౌరస్తాలో పర్వేజ్‌కు ఇస్మాయిల్ అనే మరో ఆటోడ్రైవర్ పరిచయమయ్యాడు. తన సోదరివద్ద సౌదీ అరేబియా కరెన్సీ ఉందని, మన కరెన్సీ లక్ష రూపాయలు ఇస్తే దానికి బదులుగా సుమారు లక్షా ముప్పైవేల విలువ చేసే సౌదీ కరెన్సీ ఇస్తామని తెలిపాడు. అతడి ఫోన్ నంబర్ తీసుకున్నాడు. అనంతరం ఇస్మాయిల్ సోదరి పేరుతో ఓ మహిళ ఫోన్ చేసి కరెన్సీ కావాలంటే బేగంపేటకు రావాలని చెప్పింది. జులై 19 ఉదయం పర్వేజ్ బేగంపేటలోని ఫ్యాంటలూన్ లేన్‌లోకి రాగా, ఆటోలో నలుగురు వ్యక్తులు వచ్చి సౌదీ అరేబియా కరెన్సీ అని చెప్పి బ్యాగు చూపించారు. నిజమని నమ్మిన పర్వేజ్ వారికి రెండు లక్షలు ఇచ్చాడు. వారు బ్యాగును పర్వేజ్‌కు ఇచ్చి వెళ్లిపోయారు. అనంతరం బ్యాగు తెరిచి చూడగా అందులో తెల్లకాగితాలు దర్శనమిచ్చాయి. మోస పోయానని గ్రహించిన పర్వేజ్ ఈనెల 20న పోలీసులకు

**ధనముంటే ధనవంతుడు అంటారు, ఆ ధనంతో ఇతరుల కష్టాలు తీరిస్తే భగవంతుడు అంటారు**

ఫిర్యాదు చేశాడు. పోలీసులు రెండు టీంలను ఏర్పాటు చేసి వారి కోసం తీవ్రంగా గాలించారు. అబూభకర్, సంధ్య అలియాస్ సాదియా, శాంతిలను అరెస్టు చేశారు. ప్రధాన సూత్రదారి సోయల్ పరారీలో ఉన్నాడు

**స్టాక్ మార్కెట్ ఆశచూపి రూ.15 లక్షలకు టోపీ**

స్టాక్ ట్రేడింగ్ చేస్తే తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు వచ్చేలా చేస్తామని నమ్మించిన సైబర్ నేరగాళ్లు నగరానికి చెందిన వ్యక్తి నుంచి రూ. 15.20 లక్షలు కాజేశారు. పోలీసుల కథనం ప్రకారం నగరానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి (46)ని వాట్సప్ ద్వారా కొందరు సంప్రదించారు. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెడితే తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించారు. తాము సెబీ ద్వారా అనుమతులు పొందిన "ఐసీఐసీఐ సెక్యూరిటీస్" సంస్థ ప్రతినిధులమని చెబుతూ స్టాక్ ట్రేడింగ్‌పై సలహాలు, సూచనలు అందించారు. ముందుగా రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టించి లాభాలు చూపించారు. నమ్మకం కలిగిన ఉద్యోగి పలు దఫాలుగా రూ. 15.20 లక్షలు పెట్టుబడి పేరుతో వివిధ ఖాతాల్లో డబ్బు జమ చేశాడు. ట్రేడింగ్ ఖాతాలో లాభం చూపుతున్నా, విత్‌డ్రాచేసుకునే అవకాశం లేదు. ఆ డబ్బు తీసుకోవాలంటే మరింత డబ్బు పెట్టుబడి పెట్టాలని చెప్పడంతో మోసమని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైం ఠాణాలో ఫిర్యాదు చేశాడు.

**ఫోన్‌పే పేరుతో మోసం ...**

ఫోన్‌పే పేరుతో ఓ వ్యక్తి విద్యార్థిని మోసం చేశాడు. రూ. 10 వేలు నగదు తీసుకుని ఉడాయించాడు. ఈ సంఘటన ఎస్ ఆర్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం గోపన్నపల్లికి చెందిన అల్లాడి శివశంకరవరప్రసాద్ ఎస్ఆర్ నగర్‌లోని ఒక కళాశాలలో సీఏ చదువుతున్నాడు. అక్కడి బాయ్స్ హాస్టల్లో ఉంటున్న ప్రసాద్ స్థానిక కెనరా బ్యాంక్ ఏటీఎం సెంటర్‌కు వెళ్లి రూ. 10వేలు డ్రా చేసుకున్నాడు. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తి వచ్చి తన ఏటీఎం కార్డు పనిచేయడం లేదని, అత్యవసరంగా డబ్బు కావాలని, రూ. 10 వేలు ఇస్తే ఫోన్ పే చేస్తానని నమ్మించాడు. ఫోన్‌పే లావాదేవి జరిగినట్లు ఓ మెసేజ్ చూపించి ప్రసాద్ వద్ద నగదు తీసుకుని వెళ్లిపోయాడు. తర్వాత ఫోన్‌పేలో డబ్బుల కోసం చూడగా కనిపించక పోవడంతో మోసపోయానని గ్రహించి ఎస్ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

**నిపుణుల సలహాలు**

- కంపెనీ లేదా స్కీమ్ గురించి పూర్తి సమాచారం సేకరించిన తర్వాతే పెట్టుబడి పెట్టాలి.
- లాభాలు ఆశించే వారు కచ్చితంగా ధృవీకరించిన ఆర్థిక సలహాదారులను సంప్రదించాలి.
- ఆఫర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి.
- మోసపూరిత కార్యకలాపాల కోసమే ఎక్కువ సంఖ్యలో వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూపులు, చానల్స్ ఏర్పాటవుతున్నాయి. గ్రూపుల్లో చేరకపోవడమే మంచిదని గ్రహించాలి.

**మరో ఫోన్ పే బురిడీ**

చిల్లర దుకాణం వ్యాపారిని బురిడీ కొట్టించిన ఇద్దరు టక్కరి దొంగలు రూ. 81వేలను స్వాహా చేశారు. ఈ సైబర్ క్రైం శ్రీకాళహస్తిలో వెలుగు చూసింది. శ్రీకాళహస్తి పట్టణం గాంధీవీధికి చెందిన మునిస్వామి తిప్ప ప్రాంతం ఆర్టీసీ రోడ్డులో ప్రొవిజన్‌షాపును నిర్వహిస్తుంటాడు. ఇటీవల ఒకరోజు రాత్రి ఇద్దరు యువకులు సరుకులు కొనుగోలు కోసం మునిస్వామి దుకాణానికి వచ్చారు రూ. 5వేలకు సరుకులు కొనుగోలు చేసిన తరువాత తమ వద్ద రూ.వెయ్యి నగదు మాత్రమే ఉందన్నారు. మిగతా రూ. 4వేలను ఫోన్‌పే చేసేందుకు తమ సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ అయిందని నమ్మించారు. దుకాణదారుడి సెల్‌ఫోన్ నుంచి తమ నాన్నకు ఫోన్ చేసి మిగిలిన రూ. 4 వేలను ఫోన్‌పే ద్వారా జమ చేస్తామని నమ్మించారు. దీంతో మునిస్వామి వారికి ఫోన్ ఇచ్చాడు. ఒక యువకుడు దుకాణదారుడిని మాటల్లో పెట్టాడు. మరో యువకుడు మునిస్వామి సెల్‌ఫోన్‌లో ఫోన్‌పేను ఆపరేట్ చేసి తిరిగి అప్పగించాడు. తరువాత ఆ యువకులు అక్కడి

నుంచి వెళ్లిపోయారు. కాసేపటికి బ్యాంకు ఖాతా నుంచి రూ. 81 వేలు నగదు విత్ డ్రా అయినట్లు మునిస్వామికి మెసెజ్ వచ్చింది. దాంతో సరుకుల కొనుగోలు కోసం వచ్చిన ఇద్దరు యువకులకు ఫోన్ ఇవ్వడం కారణంగా నగదు లూటీ అయినట్లు గుర్తించి బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

**నల్లా బిల్లులంటూ మోసం**

హైదరాబాద్ నగరంలో మరో కొత్త తరహా సైబర్ మోసం వెలుగులోకి వచ్చింది. వాటర్ బోర్డు అధికారులమని, నల్లా బిల్లులంటూ మోసానికి తెరలేపారు. సైబర్ కేటుగాళ్ళు డబ్బులు కొల్లగొట్టేందుకు కొత్త ఎత్తుగడలతో వాటర్ బోర్డు వినియోగదారులను మోసం చేస్తున్నారని, వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని బోర్డు అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. మొబైల్‌నంబర్ 84271 56645నుంచి నీటి బిల్లు చెల్లించకపోతే మీ నల్లా కనెక్షన్లు తొలగిస్తామని, మరిన్ని వివరాలకోసం 9064953421ను సంప్రదించాలని మెసేజ్ చేస్తున్నారని, ఇదో కొత్త తరహా సైబర్ మోసమని తెలిపారు. ఆ నంబర్‌ను సంప్రదించగానే ప్రాసెసింగ్ కోసమని ఏపీకే ఫైల్‌ను వాట్సాప్‌ద్వారా పంపిస్తారని, వాటిని పట్టించుకోవద్దని సూచించారు.

ఇటువంటి సందేశాలకు నగరవాసులు స్పందించవద్దని తెలిపారు. ఏవైనా సమస్యలు, ఇతర సందేహాలుంటే వాటర్‌బోర్డు కస్టమర్ కేర్ 155313 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

**వాట్సాప్‌లో వల.. చిక్కి విలవిల ...**

వాట్సాప్‌లోని అనేక గ్రూపుల్లో స్టాక్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్, క్రిప్టో కరెన్సీ వంటి పెట్టుబడి అవకాశాల గురించి చర్చిస్తారు. ఆకర్షణీయమైన ఆఫర్లు వస్తుంటే అవి మోసపూరిత పథకాలు అని గుర్తించాలి. పెడితే కష్టార్జితం మోసగాళ్ల పాలు కావడం ఖాయం. పెట్టుబడులు పెట్టి నష్టపోతున్న వారిలో ఎక్కువగా విశ్రాంత ఉద్యోగులు, గృహిణులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, నిరుద్యోగులు.. ఇలా చదువుకున్న వారే ఉంటున్నారని పోలీసు రికార్డులు చెబుతున్నాయి.

■

## 'బన్ని గేదె'కు రూ.14 లక్షల ధర !



**గు**జరాత్‌కు చెందిన ఓ గేదె అత్యధిక ధరకు అమ్ముడైంది. కచ్ జిల్లాలో బన్ని జాతికి చెందిన ఈ గేదె ఏకంగా రూ. 14.1 లక్షల ధర పలికి ఆశ్చర్యానికి గురి చేసింది.

కచ్ జిల్లాలోని లఖపట్ తాలుకాలోని సంధరో గ్రామానికి చెందిన గజీ హాజీ అలాదాద్ అనే వ్యక్తి ఈ బన్ని జాతికి చెందిన గేదెను రూ. 14.1 లక్షల ధరకు అమ్మాడు. దీనిని భుజ్ తాలుగాలోని సెర్వా గ్రామానికి చెందిన షెరుభాయ్ భాలు అనే వ్యక్తి కొనుగోలు చేశారు. గజి హాజీ కుటుంబం తరతరాలుగా పశుపోషణ వ్యాపారం చేస్తోంది. ప్రస్తుతం అతడి వద్ద దాదాపు 80 గేదెలు ఉన్నాయి. వాటి నుంచి రోజూ 300 లీటర్ల పాలు సేకరించి అమ్ముతుంటాడు. అతనికి నలుగురు కుమారులు ఉన్నారు. వారిలో ఇద్దరు ఇదే వ్యాపారం చేస్తున్నారు.

బన్ని జాతి గేదెలు పూర్తిగా నల్లగా ఉంటాయి. ఇవి మంచి ఆరోగ్యంగా ఉంటాయి. మిగతా వాటితో పోలిస్తే ఈ జాతి గేదెలు భిన్నంగా ఈదుతాయి. ఈ గేదెలు వివిధ పోటీల్లో విజేతలుగా నిలిస్తాయి. అందుకే ఈ జాతి గేదెలు భారీ ధరకు అమ్ముడుపోతాయని స్థానికులు అంటున్నారు. ఇవి రోజుకు 12 నుండి 18 లీటర్ల వరకు పాలిస్తాయి. వాస్తవానికి కచ్ ప్రాంతంలో గేదెల ధర రూ. 5 లక్షల నుంచి రూ. 7 లక్షల వరకు ఉంటుంది. ఇక గతంలో ఈ జాతికి చెందిన ఓ గేదె ఐవీఎఫ్ పద్ధతి ద్వారా మగ లేగదూడకు జన్మనిచ్చింది. ఐవీఎఫ్ పద్ధతిలో ఇలా జన్మనివ్వడం భారత్లో అదే మొదటిసారి.

(ఈ టీవీ భారత్ సౌజన్యంతో)

■

అధికారం, ధనం జీవన ఫలాలు ; కుటుంబం, మిత్రులు జీవన మూలాలు, మూలం లేని ఫలం మరణం!

# తెలుగును బతికించండంటూ కర్నూలులో భాషాఘోష!

**బోధనాభాషగా, ప్రథమ భాషగా, అధ్యయన భాషగా, అధికార భాషగా తెలుగుకు స్థానం కల్పించాలని వినతి**

– జె వి క్రిష్ణమూర్తి



**మ**న మాతృభాష మరణశయ్య మీద వున్నది. కన్న తల్లి జీవితాన్ని యిస్తే, తల్లిభాష మనకు ఒక ప్రత్యేక అస్తిత్వాన్ని, అవగాహనా సామర్థ్యాన్ని, నిసర్గ వ్యక్తిత్వాన్ని, తరగని సాంస్కృతిక వారసత్వ సంపదను అందిస్తుంది. 'తల్లికి వందనం' అని యింటింటా సంతోషాన్ని పంచుతున్నాం అనుకుంటున్న మనమే, పెచ్చుమీరిన పరభాషా వ్యామోహం మన తల్లి పలుకు ఉసురుతీస్తున్నా ఉలుకుపలుకు లేకుండా, ఉదాసీనంగా చూస్తున్నామే తప్ప, కాపాడడానికి కనీసం చిటికెన వేలు కూడా అందించలేని స్వయం కల్పిత నిస్సహాయ స్థితిలో వున్నాం.

మాతృభాష గొప్పదనం గురించి, అధ్యయన భాషగా తెలుగు సామర్థ్యం గురించి ఎందుకీ అర్థంపర్థం లేని అనుమానాలు? ఎన్నెన్నో ఉదాహరణలు ఎందుకు ... నేడు మన భారతావనిని అజేయ శక్తిగా అగ్రభాగాన నిలపడానికి ఫలప్రదంగా కృషిచేస్తున్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ, మన తెలుగురాష్ట్రం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు ఎంతో దార్శనికులుగా, పాలనా దక్షులుగా, వ్యూహప్రతివ్యూహ చతురులుగా ప్రపంచ ప్రశంసలు అందుకుంటున్నారు కదా, వారు కనీసం మాధ్యమిక విద్య వరకు మాతృభాషలో విద్యాభ్యాసం చేసినవారే! మరో తెలుగు రాష్ట్రం తెలంగాణా ముఖ్యమంత్రి శ్రీ రేవంతరెడ్డి కూడా తెలుగులో విద్యాభ్యాసం చేసినవారే.

విధాన నిర్ణేతలు, పాలనా వ్యవహారాలను ప్రభావితం చేయగల 'పలుకుబడి' వున్న భాషా, సాహితీ సంస్థల అధికార, అనధికార ప్రముఖులు, మరెందరెందరో పెద్దలు మనకు ఎందుకులే అని మిన్నకున్నా, కొందరు మాతృభాషా ప్రేమికులు మాత్రం వ్యక్తిగతంగా, సంఘాలు, సంస్థల రూపేణా 'తెలుగుకు అతిశయించిన అన్యభాషాభిమానమనే తెగులు పట్టింది, ఆ చీడను వదిలించి, అది శాశ్వతంగా కనుమరుగు కాకుండా కాపాడండి మహాప్రభో' అంటూ ఏళ్ళతరబడి ఘోషిస్తున్నారు. అయితే, ఎంత గొంతెత్తి అరచినా వారి మాట వినిపించుకునేవారేరీ? వారిది అరణ్య రోదనగానే మిగిలిపోతున్నది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, తమ ప్రయత్నాలకు ఎంత నిరాదరణ ఎదురైనా, 'ఆరంభింపరు నీచమానవులు ..'అనే కార్యదీక్షా స్ఫూర్తితో, అంతులేని ఆశా భావంతో , ఆత్మవిశ్వాసంతో వారు తమ గొంతులకు మరింత పదునుపెడుతున్నారేతప్ప 'తల్లి మాట' జవదాటడంలేదు.

ఆ కోవకు చెందిన మరో బృహత్ ప్రయత్నం జులై 12–13 తేదీలలో కర్నూలులో చోటుచేసుకున్నది. 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి తెలుగు భాషా పరిరక్షణ సదస్సు' పేరిట నిర్వహించిన ఈ చర్చాగోష్ఠిలో నిర్వాహకులు మొత్తం 26 జిల్లాలనుంచి తెలుగు భాషా పరిరక్షణోద్యమ క్రియాశీల

సామర్థ్యం విజయాన్ని అందిస్తుంది, చక్కని నడవడిక ఆ విజయానికి ఆయువు పెంచుతుంది

కార్యకర్తలను ఉపన్యాసకులుగా ఆహ్వానించారు. కాగా, 16 జిల్లాల ప్రతినిధులు హాజరైనారు. మరో తెలుగు భాషా రాష్ట్రమైన తెలంగాణాకు కూడా ఈ సదస్సులో ప్రాతినిధ్యం కల్పించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయదుకు 26 అంశాలతో కూడిన వినతిప్రత్రాన్ని కర్నూలు జిల్లా కలెక్టర్ ద్వారా పంపాలని తీర్మానిస్తూ , మన మాతృ భాష మళ్ళీ పూర్వవైభవాన్ని సంతరించుకుంటుందన్న ఆశాభావంతో రెండు రోజుల చర్చా గోష్ఠి ముగిసింది.

**తీర్మానాలు**

బోధనాభాషగా, ప్రథమ భాషగా, అధ్యయన భాషగా, అధికార భాషగా తెలుగుకు స్థానం కల్పించాలని, అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలలో ఒక తప్పనిసరి అంశంగా తెలుగును అధ్యయనంచేసేలా చట్టం చేసి, కట్టుదిట్టంగా అమలు పరచాలన్నది ప్రధానమైన డిమాండ్. అధికార భాషగా తెలుగు అమలుకు ప్రత్యేకంగా ఒక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని, విద్యార్థులు అన్ని పోటీ పరీక్షలను తెలుగుభాషలో వ్రాసే అవకాశం కల్పించాలని, అన్ని విద్యాలయాల్లో 5వ తరగతి వరకు తెలుగు మాధ్యమంలోనే బోధించాలన్నవి ఇతర ముఖ్య తీర్మానాలలో మరికొన్ని .

రాజ్యసభ మాజీ సభ్యులు శ్రీ టి జి వెంకటేష్ గారు గౌరవ అధ్యక్షులుగా, శ్రీ తూమాటి సంజీవరావు గౌరవ సలహాదారుగా , విశ్రాంత ఐ ఏ ఎస్ అధికారి శ్రీ ముక్తేశ్వర రావు ఒక ప్రధాన వక్తగా, శ్రీ కె సి కల్కూర, శ్రీ జె ఎస్ ఆర్ కె శర్మ, శ్రీ పత్తి ఓబులయ్య , డాక్టర్ డి పార్వతీదేవి నిర్వహణలో ఈ సదస్సు చక్కగా జరిగింది.

**ఇద్దరే యిద్దరు !**

కార్యక్రమం మాతృభాష మీద. తల్లిభాషను శైశవ దశనుంచే ఉగ్గుపాలతో (?) రంగరించి నేర్పవలసింది మాతృమూర్తే . అయినా, ఈ సదస్సు నిర్వాహకులలో కాని, వక్తలలో కాని మహిళల ప్రాతినిధ్యం కేవలం నామ మాత్రమే! నిర్వాహకులలో ఒకరు, వక్తలలో మరొకరు మాత్రమే మహిళలు. ఇకపైనైనా ఇలాంటి సదస్సులలో మహిళలకు సముచిత ప్రాతినిధ్యం, ప్రాధాన్యం లభిస్తుందని ఆశిద్దాం. ■

## నౌకాదళ ఫైటర్ పైలట్‌గా తొలి మహిళ ఆస్థా పూనియా

**భా**రత నౌకాదళ చరిత్రలో ఓ సరికొత్త అధ్యాయం లిఖితమైంది. సబ్ లెఫ్టినెంట్ ఆస్థా పూనియా, నేవీ ఫైటర్ పైలట్‌గా శిక్షణ పొందిన మొట్టమొదటి మహిళా అధికారిగా చరిత్ర సృష్టించారు. లైంగిక సమానత్వం దిశగా నౌకాదళం వేసిన ఈ కీలక అడుగు, భవిష్యత్తులో మరింత మంది మహిళలు సాయుధ దళాల్లో ఉన్నత బాధ్యతలు చేపట్టేందుకు స్ఫూర్తినివ్వనుంది.



ఐఎన్ఎస్ డేగాలో జులై 3న జరిగిన సెకండ్ బేసిక్ హాక్ కన్వర్షన్ కోర్సు స్నాతకోత్సవంలో ఆస్థా పూనియా ఈ అరుదైన ఘనతను సాధించారు. ఈ కార్యక్రమంలో ఆమె, లెఫ్టినెంట్ అతుల్ కుమార్ ధుల్‌తో కలిసి ఏసీఎన్ఎస్ (ఎయిర్), రియర్ అడ్మిరల్ జనక్ బేవలీ చేతుల మీదుగా ప్రతిష్ఠాత్మక 'వింగ్స్ ఆఫ్ గోల్డ్' పురస్కారాన్ని అందుకున్నారు. ఈ విషయాన్ని భారత నౌకాదళం ఎక్స్ వేదికగా వెల్లడించింది. ఇప్పటికే మహిళా అధికారులు పైలట్లుగా, నేవల్ ఎయిర్ ఆపరేషన్స్ ఆఫీసర్లుగా హెలికాప్టర్లు, నిఘా విమానాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే, అత్యంత కీలకమైన ఫైటర్ స్ట్రీమ్‌లోకి ఓ మహిళా పైలట్‌ను తీసుకోవడం ఇదే ప్రథమం. 'నారీశక్తి'ని ప్రోత్సహిస్తూ, నౌకాదళ వైమానిక విభాగంలో (నేవల్ ఏవియేషన్) మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలనే నిబద్ధతకు ఈ చారిత్రక ఘట్టం నిదర్శనమని నేవీ పేర్కొంది. ఆస్థా పూనియా విజయం అడ్డంకులను అధిగమించి, ఓ నూతన శకానికి నాంది పలికిందని ప్రశంసించింది. ■

ఆలోచనలు మారవచ్చు కాని సిద్ధాంతం కాదు, ఆకులు రాలవచ్చు కాని మూలం నశించకూడదు

# ఏపిమాస్ ఆధ్వర్యంలో వి ఓ ఏలకు శిక్షణ

– ఎస్. సత్యనారాయణ

**క**ర్నూలు జిల్లా గొనిగండ్లలోగ్రామస్థాయి సిబ్బంది అయిన వి ఓ ఏలకు నీరు, పారిశుధ్యం, పరిశుభ్రతపై (వాష్ అంశాలపై) అవగాహన పెంపొందించేందుకు ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని ఏపిమాస్ నిర్వహించింది. ఈ శిక్షణలో నీరు, పారిశుధ్యం, మౌలిక సౌకర్యాలు, ఆరోగ్యకరమైన జీవనశైలి, మరుగుదొడ్ల వినియోగం, ఇంటి పరిసరాల పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలపై విపులంగా శిక్షణ ఇవ్వడం జరిగింది. ఏపిమాస్ తరపున 'వాష్' ప్రాజెక్టు మేనేజర్ శ్రీ కే. శ్రీనివాస్ సురక్షితమైన తాగునీరు, పారిశుధ్యం పరిశుభ్రత ప్రాముఖ్యత గురించి వివరించారు. మంచి నీటి వినియోగం, చేతి పరిశుభ్రత పద్ధతులు, క్షేత్ర స్థాయిలో ప్రస్తుతం ఉన్న సమస్యలు, లోపాలను ఎలా అధిగమించాలో సూచనలు ఇచ్చారు.



జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థకు చెందిన జిల్లా ప్రాజెక్టు మేనేజర్ శ్రీమతి నరసమ్మ మాట్లాడుతూ, గ్రామాల్లో పరిశుభ్రత పై ప్రజల్లో అవగాహన పెంపొందించాల్సిన బాధ్యత వి ఓ ఏల పైన ఎంతగానో వున్నదని, వారు తమ పరిధిలో సకాలంలో సమాచారాన్ని ప్రజలకు చేరవేయాలని పేర్కొన్నారు. ప్రతి కుటుంబము మరుగుదొడ్లు ఉపయోగించేట్టు అవగాహన పెంపొందించాలని, ఏపిమాస్ 'వాష్'ప్రాజెక్ట్ ద్వారా శిక్షణలో నేర్చుకున్న అంశాలను గ్రామాల్లో, సంఘాల నెలవారీ సమావేశాలలో తెలియజేయాలని వి ఓ ఏల కు ఆమె సూచించారు.

వాష్ ప్రాజెక్ట్ రీజినల్ కోఆర్డినేటర్ శ్రీ సత్యనారాయణ శిక్షణలో నేర్చుకున్న నీరు, పారిశుధ్యం, పరిశుభ్రత అంశాల పై స్వయం సహాయ సంఘ సభ్యుల అవగాహన పెంపు కోసం కృషి చేయవలసినదిగా వి ఓ ఏలను కోరారు.

శిక్షణ పొందిన వి ఓ ఏ లు అందరినీ వాష్ ప్రాజెక్ట్ ఎం ఐఎస్ వెబ్ పోర్టల్‌లో కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్‌గా రిజిస్టర్ చేయడం జరిగింది. తద్వారా ఇక నుంచి వారు స్వయం సహాయ సంఘ సభ్యులు తీసుకునే వాష్ రుణ వివరాలన్నీ అందులో పొందుపరిచేందుకు వీలవుతుంది. చివరగా శిక్షణలో పాల్గొన్న వి ఓ ఏ లు మాట్లాడుతూ, ఈ శిక్షణ ఎంతో ఉపయోగకరంగా వున్నదని, ఈ శిక్షణ అంశాలను సంఘాల సభ్యులకు తెలియజేసి వారి కుటుంబాల ఆరోగ్యాన్ని మెరుగు పరిచేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ■

## అంతరిక్షంలో మెంతి, పెసర పెంపకం!

**ఇం**టర్నేషనల్ స్పేస్ స్టేషన్‌కు వెళ్లిన భారత వ్యోమ గామి శుభాన్షు శుక్లా అంతరిక్షంలో రైతు అవతారమెత్తారు. మెంతి, పెసర విత్తనాలను చిన్నపాటి గాజు పాత్రల్లో వేసి పెంచే పరిశోధన చేశారు. జీరో గ్రావిటీ వాతావరణంలో ఈ మొక్కల పెరుగుదల ఎలా ఉంటుందోనన్న దానిపై ఆయన అధ్యయనం చేస్తున్నారు. ఐఎస్ఎస్‌లోని ప్రత్యేక స్టోరేజీ ఫ్రీజర్‌లో వాటిని ఉంచి అవి మొలకెత్తే విధానాన్ని ఫొటోలు తీశారు. ఈ పరిశోధనలో ధార్వాడ్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన రవికుమార్ హోసమణి, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన సుధీర్ సిద్దపురెడ్డి అనే ఇద్దరు శాస్త్రవేత్తలు శుక్లాకు సహకరిస్తున్నారు. భూమికి తిరిగి వచ్చాక... ఈ మొలకల్లోని జన్యు మార్పులు, పోషక విలువలను విశ్లేషించనున్నట్లు యాక్సియం స్పేస్ సంస్థ తెలియజేసింది. ■

**నీలో మార్పు రాకుండా ఇతరులలో మార్పు రావాలనుకోవడం అత్యాశ**

# నిస్సహాయ కుటుంబాలకు ఏపిమాస్‌చే మరుగుదొడ్ల నిర్మాణం

– మైత్రి ప్రవీణ్

నిర్మల్ జిల్లాలోని భైంసా మండలం, మహాగాం తాండాలో గత 25 సంవత్సరాలుగా నివసిస్తున్న యువరాజ్ (వయసు 44), అతని భార్య సునీత (వయసు 38) వారి నలుగురు పిల్లలతో పాటు కష్టాలతో కూడిన జీవితం గడుపుతున్నారు. పుట్టుకతోనే వికలాంగుడైన యువరాజ్ నడవలేడు. సునీతకు కూడా శారీరక లోపం వల్ల కూలీ పనులు చేయలేని పరిస్థితి. వారి కుటుంబం కేవలం ప్రభుత్వం యిచ్చే పెన్షన్ పైనేఆధారపడుతూ జీవనం సాగిస్తోంది.

వారి ఇంట్లో మరుగుదొడ్డి లేకపోవడంతో, ఆరోగ్య సమస్యలు పెరిగిపోతున్నాయి. ఇదే పరిస్థితి సోనుబాయి (64), సంతోష్, అతని భార్య కవిత, ఒఖిల్ భార్య మీరాబాయి వంటి వారి ఇరుగు పొరుగు కుటుంబాల్లోనూ కనిపించింది. బహిరంగ మలవిసర్జన వల్ల వాంతులు, విరేచనాలు, జలుబు, మలమూత్ర సంబంధిత వ్యాధులతో పాటు పాము కాటు, ఆర్థిక భారాలు ఈ కుటుంబాలను తీవ్రమైన సమస్యల్లోకి నెట్టాయి.

ఈ నేపథ్యంలో, ఏపిమాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'వాష్' అవగాహన కార్యక్రమంలో యువరాజ్ కుటుంబం, ఇతర బాధిత కుటుంబాలు పాల్గొన్నారు. అక్కడ వారు వ్యక్తిగత గౌరవం, ఆరోగ్య రక్షణ కోసం మరుగుదొడ్డి అవసరాన్ని గుర్తించారు.

ఈ కుటుంబాల పరిస్థితిని తెలుసుకున్న జిల్లా వాష్ ప్రాజెక్ట్ సమన్వయకర్త శ్రీమైత్రి ప్రవీణ్వివరాలను సంబంధిత ప్రాజెక్టు మేనేజర్ శ్రీ కే. శ్రీనివాస్‌కు తెలియజేశారు. వారు వెంటనే తాండాలోని కుటుంబాలను కలిసి, తాండా నాయకులు, గ్రామ పెద్దలు, గ్రామ సంఘాల సభ్యులు, పంచాయితీ సభ్యుల సహకారంతో ఉపశమన చర్యలు చేపట్టారు. అనంతరం, ఏపిమాస్ వ్యవస్థాపక సిఇ ఓ, ఎం డి శ్రీ సి ఎస్. రెడ్డి గారికి ఈ సమాచారాన్ని అందించి, వారి సహకారంతో నీరు పారిశుధ్యం, పరిశుభ్రత (వాష్) ప్రాజెక్ట్‌లో భాగంగా రూ. 1,50,000 వాటర్.ఆర్గ్ సంస్థ నిధులతో ఈ 4 కుటుం బాలకు ఉపయోగపడే విధంగా సామాజిక (కమ్యూనిటీ) మరుగుదొడ్లు, స్నానాల గదులు నిర్మించాలని సంకల్పించారు.



వెంటనే, మహాగాం తాండాలో ఈ పనులను ప్రారంభించి, ఆ కుటుంబాల సహకారంతో పనులు వేగంగా పూర్తయ్యేలా చేశారు. కమ్యూనిటీ మరుగుదొడ్లు, స్నానాల గదుల నిర్మాణ సమయములో మైత్రి ప్రవీణ్‌తో పాటు ఏపిమాస్ బృందం తరచూ పర్యవేక్షణ నిర్వహిస్తూ మార్గనిర్దేశం చేశారు.

**ప్రారంభోత్సవ వేడుక**

ఈ సామాజిక మరుగుదొడ్ల ప్రారంభోత్సవాన్ని పండుగలా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపిమాస్ కెపాసిటీ బిల్డింగ్ డైరెక్టర్ శ్రీ జాజున మురళి, ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీ కే. శ్రీనివాస్, గ్రామ పెద్దలు, సంఘాల సభ్యులు, పంచాయితీ సెక్రటరి అనిత గారు, స్థానికులు హాజరయ్యారు. ఏపిమాస్ అమలు చేస్తున్న వాష్ ప్రాజెక్ట్ ద్వారా తమ కుటుంబాలకు మరుగుదొడ్డి సమస్య పరిష్కరించబడినందుకు,



ఆ నాలుగు కుటుంబాల సభ్యులు ఏపిమాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

**కుటుంబాల అనుభవాలు**

**యువరాజ్ :** "నా జీవితంలో ఎన్నో అవమానాలను ఎదు ర్కొన్నాను. వికలాంగుడిగా ఉండటమే కాక, ఇంట్లో మరుగు దొడ్డి లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులు ఎదురయ్యాయి. ఇప్పుడు ఈ గదులు నాకు గౌరవాన్ని, ఆరోగ్యాన్ని తీసు కొచ్చాయి. ఏపిమాస్, వాటర్.ఆర్గ్ సంస్థలకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు."

**కవిత :** "నాకు పాము కాటు వల్ల రూ.70,000 ఖర్చు అయింది. మరుగుదొడ్డి లేనందుకు ఎదురైన ఈ అనర్థం ఇక ఎవరికీ జరగకూడదు. ఈ నిర్మాణంతో మా జీవితాల్లో వెలుగు వచ్చింది."

**సోనుబాయి :** "చూడలేను, నడవలేను, కానీ బహిరంగ ప్రదేశాల్లో వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఇక భద్రంగా ఉంటుంది."

**మీరాబాయి:** "నాకు చిన్న పిల్లలు ఉన్నారు. మరుగుదొడ్డి లేక ఎన్నో యిబ్బందులు పడ్డాము. ఇప్పుడు సౌకర్యంగా, గౌరవంగా వుంటుంది. పిల్లల చదువులు ఇబ్బందిలేకుండా సాగుతాయని భావిస్తున్నాను."

నీరు, పారిశుద్యం, పరిశుభ్రత (వాష్) కార్యక్రమం ద్వారా నాలుగు పేదల, శారీరక సవాళ్లతో కూడిన కుటుంబాలకు మరుగు దొడ్డి, స్నానాల గదుల సౌకర్యం లభించింది. ఆరోగ్య సమస్యలను అధిగమించే మార్గం ఏర్పడింది. వారి ఆత్మగౌరవం నిలబడింది. ఇది ఒక చిన్న తోడ్పాటే కావచ్చు, కాని అది జీవనాన్నే చక్కదిద్దే మార్పు! ■

## స్వయంసహాయ మహిళల ఆధ్వర్యంలో కామన్ సర్వీస్ సెంటర్లు

**ఏపీ** ప్రభుత్వం మరో కొత్త పథకాన్ని తీసుకొచ్చింది.. రాష్ట్రంలోని పట్టణ ప్రజల కోసం డీజీ లక్ష్మి పథకాన్ని అమలు చేసేందుకు సిద్ధమైంది. డీజీ లక్ష్మి ద్వారా ప్రజలకు 250 రకాల సేవలు అందించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 9,034కామన్‌సర్వీస్‌సెంటర్లు(సీఎస్‌సీ సాధారణ సేవా కేంద్రాలు) ఏర్పాటు చేస్తారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు (డ్వాక్రా మహిళలు) ఈ కేంద్రాలను నిర్వహిస్తారు. ఈ మేరకు ఈ సీఎస్‌సీ సెంటర్ల నిర్వహణ కోసం అర్హులైన సభ్యులను ఎంపిక చేసేందుకు మెప్మాకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న ఈ సీఎస్‌సీ కేంద్రాల ద్వారా ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. మీ–సేవా కేంద్రాల తరహా లోనే ఈ సెంటర్లలో వివిధ రకాల సేవల్ని ప్రజలు పొందవచ్చు.

ఈ పథకానికి ఎంపిక కావాలంటే కొన్ని అర్హతలు ఉండాలి. 'స్వయం సహాయక సంఘంలో కనీసం మూడేళ్ల క్రితం చేరి ఉండాలి. 21 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు ఉండాలి. వివాహం అయి ఉండాలి.. సంబంధిత స్లమ్ లెవెల్ ఫెడరేషన్ పరిధిలో నివాసి అయి ఉండాలి. డిగ్రీ చదివి ఉండాలి..స్మార్ట్ ఫోన్ ఉండాలి. ఎంపికైన సభ్యులకు సెంటర్ ఏర్పాటు చేయడానికి రూ.2.50 లక్షల వరకు రుణం (కియోస్క్, ఇతర సదుపాయాల కల్పనకు) ఇస్తారు.

రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థల్లో నైపుణ్యాభివృద్ధి శిక్షణకు ప్రభుత్వం రూ.23.84 కోట్లు ఖర్చు చేయనుంది. ఈ మేరకు పట్టణ స్థానిక సంస్థల్లో ఉన్న ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, సిబ్బందికి ప్రత్యేకంగా శిక్షణ ఇస్తారు.

వీరితో పాటుగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు కూడా నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఉంటుంది. స్వచ్ఛ భారత్ అర్బన్ 2.0 కార్యక్రమంలో భాగంగా ఈ శిక్షణ ఉంటుంది. 123 మున్సిపల్, కార్పొరేషన్లు, నగర పంచాయతీల్లో శిక్షణ ఇస్తారు. ■

వివేకం వంద ఏళ్ళుగా చేసిన కృషిని అవివేకం ఒక్క క్షణంలో భస్మంచేస్తుంది

# ఆంధ్రప్రదేశ్ కు జాతీయ పురస్కారాల పంట!

## ఒక జిల్లా - ఒక ఉత్పత్తిలో స్వర్ణం, మరి 9 అవార్డులు : స్వచ్ఛ సర్వేక్షణ్ లో 5 అవార్డులు

**'ఒక** జిల్లా..ఒక ఉత్పత్తి' (ఓడీఓపీ) కార్యక్రమం కింద ఆంధ్రప్రదేశ్‌కు గోల్డ్ అవార్డు దక్కింది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ ప్రతిష్ఠాత్మక ఓడీఓపీ–2024 అవార్డులను ప్రదానం చేశారు. విదేశాల్లోని భారత మిషన్లు, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, జిల్లాలు అనే మూడు విభాగాల్లో మొత్తం 34 అవార్డులను ప్రదానం చేశారు. ఉత్తమ రాష్ట్రాల కేటగిరిలో మహారాష్ట్ర, పంజాబ్, ఉత్తర ప్రదేశ్‌తో పాటు ఆంధ్రప్రదేశ్ గోల్డ్ అవార్డును అందుకుంది. జిల్లాల విభాగంలో వ్యవసాయ కేటగిరిలో గుంటూరు(మిర్చి) గోల్డ్ అవార్డును, శ్రీకాకుళం(జీడిపప్పు) కాంస్య అవార్డును అందుకున్నాయి. వ్యవసాయేతర ఉత్పత్తుల కేటగిరిలో బాపట్ల(చీరాల సిల్క్ చీరలు – కుప్పడం), విజయనగరం (బొబ్బిలి వీణ), తిరుపతి(వెంకటగిరి కాటన్ చీరలు) గోల్డ్ అవార్డును, శ్రీసత్యసాయి(ధర్మవరం సిల్క్ చీరలు) రజత అవార్డును, అనకాపల్లి(ఏటికొప్పాక బొమ్మలు), కాకినాడ (పెద్దాపురం సిల్క్స్) కాంస్య అవార్డును, పశ్చిమగోదావరి (నరసాపూర్ క్రోచెట్ లేస్‌లు) ప్రత్యేక ప్రశంస అవార్డును అందుకున్నాయి. న్యూ ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర వాణిజ్య,పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్ ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా చేతుల మీదుగా రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, చేనేత, జౌళిశాఖ మంత్రి సవిత, ఆయా జిల్లాల కలెక్టర్లు అవార్డులు అందుకున్నారు.

### ఐదు స్వచ్ఛ సర్వేక్షణ్ పురస్కారాలు

**కేం**ద్ర పట్టణాభివృద్ధి శాఖ నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్ 2024–25 పోటీలో ఏపీ ఐదు అవార్డులు కైవసం చేసుకుంది. 10 లక్షల జనాభా పైపడిన నగరాల సూపర్ స్వచ్ఛ లీగ్ కేటగిరీలో విజయవాడ, 3–10 లక్షల జనాభా కేటగిరీలో గుంటూరు, మూడు లక్షల లోపు జనాభా విభాగంలో తిరుపతి పురస్కారాలు గెలుచుకున్నాయి. ప్రత్యేక కేటగిరీలో జీవీఎంసీ విశాఖపట్నం, ప్రామిసింగ్ స్వచ్ఛ షెహర్ ఆఫ్ ది స్టేట్ కేటగిరీలో రాజమహేంద్రవరం మినిస్టీరియల్ అవార్డులను సొంతం చేసుకున్నాయి. దిల్లీలో యిటీవల నిర్వహించిన ఒక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, మునిసిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్, ఆయా నగరాల మేయర్లు, కమిషనర్లు పురస్కారాలు అందుకున్నారు.

### తెలంగాణకు రెండు అవార్డులు

**స్వ**చ్ఛ సర్వేక్షణ్ 2024–25 సంవత్సరం తొమ్మిదో ఎడిషన్‌లో గ్రేటర్ హైదరాబాద్ మంత్రిత్వ అవార్డు (రాష్ట్ర స్థాయి) సాధించగా, సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్ మంత్రిత్వ అవార్డు (ప్రత్యేక విభాగం) పొందింది. రాష్ట్రంలోని మిగతా మున్సిపాలిటీలేవీ కూడా (యూఎల్‌బీ) అవార్డుకు ఎంపిక కాలేదు. స్వచ్ఛ సర్వేక్షణ్ చివరి అంతిమ దశ– 9వ ఎడిషన్ కోసం ఫీల్డ్ అసెస్‌మెంట్ ఫిబ్రవరి 15న ప్రారంభమై, మార్చి చివరి నాటికి ముగిసింది.

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)

### గుంటూరు మిర్చికి ప్రపంచ ఖ్యాతి

**గుం**టూరు జిల్లాలో ప్రధాన వాణిజ్య పంట మిరప. ఈ మిర్చికి ఘాటు ఎక్కువ. ఇక్కడి భూములు, సాగు విధానాలు, వాతావరణం వల్ల ఇతర ప్రాంతాల్లో పండే మిర్చితో పోలిస్తే దీనికి ప్రత్యేకత ఉంది. అందుకే ప్రపంచ వ్యాప్తంగా గుంటూరు మిర్చి మన్నన పొందుతోంది. గుంటూరులో విత్తనం మొదలుకుని ఎగుమతుల వరకు అన్ని దశల్లోనూ ఈ మిర్చికి ప్రత్యేకతలు ఉన్నాయి. పొరుగు రాష్ట్రాల రైతులు సైతం ఇక్కడి విత్తనాలు కొనుగోలు

# చెత్త వేయండి.. ఉచితంగా సరుకులు పట్టుకెళ్లండి.. !

**ఆం**ధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్రామీణ స్వచ్ఛతను మరో స్థాయికి తీసుకెళ్లేందుకు సరికొత్త ఆలోచనతో ముందు కొచ్చింది. దాని పేరే 'స్వచ్ఛ రథం' పైలట్ ప్రాజెక్ట్. ఈ పథకం ద్వారా పల్లెల్లో చెత్త సేకరణను ప్రోత్సహించి, దానికి బదులుగా ఉచిత నిత్యావసర సరుకులు అందించాలనేది ఈ ప్రాజెక్ట్ లక్ష్యం. ఈ వినూత్న కార్యక్రమం తొలిసారిగా గుంటూరు జిల్లా ప్రత్తిపాడులో ఆరంభమైంది. ఈ పథకం వెనుక స్ఫూర్తి కేంద్ర ప్రభుత్వ 'స్వచ్ఛ భారత్ మిషన్'. దీన్ని ఆదర్శంగా తీసుకుని, ఏపీ ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ప్రారం భించింది. ఇప్పుడు ఈ స్వచ్ఛత ఉ ద్యమాన్ని గ్రామాల్లోకి విస్తరించేందుకు పంచాయతీరాజ్ శాఖ స్వచ్ఛ రథం పైలట్ ప్రాజెక్టును రూపొందించింది.

ఇది ఎలా పని చేస్తుందంటే, ఒక మొబైల్ యూనిట్ లాంటి స్వచ్ఛ రథం గ్రామాల్లో తిరుగుతుంది. ప్రజలు తమ ఇంటి చెత్తను ఈ రథానికి అందిస్తే, ఆ చెత్త బరువును బట్టి 20 రకాల నిత్యావసర వస్తువులు ఉచితంగా ఇస్తారు. బియ్యం, పప్పులు, చక్కెర, నూనె లాంటి సరుకులు ఇందులో ఉంటాయి. ఇలా చెత్త ఇవ్వడం ద్వారా గ్రామీణ స్వచ్ఛతను పెంచడమే కాక, ప్రజలకు ఉపయోగకరమైన సరుకులు కూడా దొరుకుతాయి.

ఈ స్వచ్ఛ రథం పైలట్ ప్రాజెక్ట్ ప్రత్తిపాడు మండలం లోని లాలుపురం పంచాయతీలో ఘనంగా ప్రారంభమైంది. ఈ పైలట్ ప్రాజెక్ట్ విజయవంతమైతే, రాష్ట్రవ్యాప్తంగా ఇతర గ్రామాలకు కూడా విస్తరించే అవకాశం ఉంది.

ఈ పథకం వల్ల గ్రామీణ స్వచ్ఛత మెరుగవడమే కాదు, ప్రజల ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. చెత్త ఎక్కడపడితే అక్కడ వేస్తే కలిగే వ్యాధులను నివారించవచ్చు. అంతేకాదు, ఈ ప్రాజెక్ట్ ద్వారా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించే దిశగా కూడా ఒక అడుగు వేయవచ్చు.

ప్రజలు ఈ కార్యక్రమంలో భాగమైతే, ఇది ఒక అద్భుత మైన మార్పును తీసుకొస్తుంది. చెత్త సేకరణకు బదులుగా ఉచిత సరుకులు పొందడం అంటే, ఇది ప్రజలకు ఒక ఆకర్షణీయమైన ప్రోత్సాహకం కూడా. ఇలాంటి పథకాలు గ్రామీణ జీవనాన్ని మరింత ఆరోగ్యవంతంగా, సౌకర్యవంతంగా మార్చగలవు.

(తెలుగు సమయం)

■

---

చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కొత్తగా మార్కెట్లోకి వచ్చే ఎరువులు, పురుగుమందులను ఇక్కడే పరిచయం చేస్తున్నారు. సాగులో కొత్త పద్ధతులకూ గుంటూరు జిల్లా నెలవుగా ఉంది. ఆసియాలో అతిపెద్దదైన మిర్చియార్డు కొలువైంది కూడా ఇక్కడే. రైతులకు గిట్టుబాటు ధర దక్కేవరకు మిర్చిని నిల్వ చేసుకోవడానికి గుంటూరు పరిసరాల్లో 80కిపైగా శీతల గిడ్డంగులు ఉన్నాయి. విత్తన పరిశోధన స్థానం లాం, మిర్చిలో పురుగుమందుల అవశేషాల శాతాన్ని పరీక్షించే లేబొరేటరీ అందుబాటులో ఉన్నాయి. రైతులు బృందంగా ఏర్పడి రసాయన రహిత మిర్చి ఉత్పత్తిచేస్తున్నారు.

(సమయం సౌజన్యంతో)

## పలాస జీడిపప్పుకు అంతర్జాతీయ గుర్తింపు

**ప**లాస జీడిపప్పు... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే కాదు దేశవ్యాప్తంగా చాలా గుర్తింపు ఉన్న జీడిపప్పు. రుచికి, నాణ్యతకు ఇది పెట్టింది పేరు. అంతర్జాతీయ మార్కెట్లో కూడా దీనికి మంచి పేరు ఉంది. టీటీడీ దేవస్థానానికి కూడా పలాస జీడిపప్పు సరఫరా అవుతుంది. శ్రీకాకుళం జిల్లాలో జీడి పంట అనేకమందికి ప్రధాన జీవనాధారంగా ఉంది. ఈ జిల్లాలో 24,000 హెక్టార్లలో జీడిమామిడి సాగు అవుతోంది. ఇందులో 22,000 హెక్టార్ల తోటలు జీడిపప్పు దిగుబడినిస్తున్నాయి. పలాస, మందస, వజ్రపుకొత్తూరు, సోంపేట వంటి ఉద్దానం మండలాల్లో జీడిమామిడి పంటను బాగా సాగుచేస్తున్నారు. ఈ పంట ద్వారా జిల్లాలో 1,05,000 కుటుంబాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవనం సాగిస్తున్నాయి.

■

# కవర్లలో చుట్టిన మామిడి పండ్లకు అధిక ధర!

– డా. భార్గవి

**అ**న్నమయ్య జిల్లా, పీలేరు మండలంలోని బోడుమల్లు వారి పల్లి గ్రామానికి చెందిన మిథున్ రెడ్డి రెండు ఎకరాల్లో హిమాయత్ మామిడి సాగు చేస్తుంటాడు. పెద్ద సైజు, తీయని రుచి, మంచి సువాసన కలిగిన ఈ పండ్లు మార్కెట్లో అధిక గిరాకీ కలిగి వుంటాయి. గతంలో మిథున్ రెడ్డి ఎప్పుడూ తన మామిడి పంటను స్థానిక వ్యాపారులకే అమ్మేవాడు. ఎలాంటి ప్యాకింగ్ లేకుండా, సాదా బస్తాలలో పంపేవాడు. ఈ తరలింపు సమయంలో పండ్లు నలిగిపోవటం, చిట్లి పోవటం వల్ల క్వాలిటీ దెబ్బతిని, తక్కువ ధరే వచ్చేది.



**కొత్త ప్రయత్నం :** 2024 నుంచి మిథున్ రెడ్డి తన తోటలో ' ఫ్రూట్ కవర్ ' (పండ్లను కప్పివుంచే చిన్న సంచి) వినియోగించడం ప్రారంభించాడు. ఇక ఈ ఏడాది శుభ్రమైన కవర్ కట్టిన పండ్లను ప్యాకింగ్ చేసి, పీలేరు ఎఫ్.పి.ఓ ద్వారా నేరుగా ముంబై మార్కెట్ కు పంపారు.

**కవర్లు కట్టడం వల్ల ఉపయోగాలు:**

- ⇨ నిల్వ సామర్థ్యం పెరుగుతుంది.
- ⇨ అధిక ధర లభిస్తుంది.
- ⇨ మార్కెట్లో ప్రత్యేక గుర్తింపు వస్తుంది, బ్రాండింగ్‌కు అనుకూలం.
- ⇨ మధ్యవర్తులు తగ్గి నేరుగా మార్కెట్‌కు చేరుతాయి
- ⇨ రైతుకు అదనపు లాభం
- ⇨ ఎగుమతులకు మరింత అనువు. టేబుల్ వెరైటీ మామిడి పండ్లు ఎక్కువగా విదేశాలకు ఎగుమతి అవుతాయి.

**తీసుకున్న చర్యలు:**

- ⇨ కవర్ కట్టిన నాణ్యమైన పండ్లను చెట్టునుంచి దింపి, గ్రేడ్ చేసి, ఒక్కో క్రేట్‌లో 20 కిలోల పండ్లు ప్యాక్ చేశారు.
- ⇨ పీలేర్ ఎఫ్‌పిఓ ముంబైలోని ఏజెంట్‌తో నేరుగా ఒప్పందం కుదుర్చుకుని సరఫరా ప్రారంభించింది.

**కవరు చేసిన మేలు**

| అంశం | కవర్ కట్టిన పండు | కవర్ కట్టని పండు |
|---|---|---|
| పండునష్టం | 5% లోపు | 18% వరకు |
| నిల్వసామర్థ్యం | ఎక్కువ (7రోజులు) | తక్కువ (3–4రోజులు) |
| సగటు ధర | రూ. 135/కిలో | రూ. 55–60/కిలో |
| లాభం | అధికం | తక్కువ |

**రైతుకు ఆదాయంలో తేడా**

**గత సంవత్సరం (2024):**

- ⇨ ఉత్పత్తి : 900 కిలోలు
- ⇨ కవర్ కట్టినవి, కట్టనవి అన్నీ కలిపి స్థానికంగా విక్రయించాడు.
- ⇨ సగటు ధర: రూ. 50/కిలో
- ⇨ రాబడి : సుమారు రూ. 45,000/–

**ఆశాభావం అంటే సమస్యలలో పరిష్కారాన్ని , ఆటంకాలలో అవకాశాలను చూడగలిగేలా చేసేది**



**ఈ సంవత్సరం (2025):**

- ఉత్పత్తి: 1.15 టన్నులు
- 50% పండ్లకు ఫ్రూట్ కవర్, 50% కవర్ లేకుండా
- ఫ్రూట్ కవర్ పండ్లకు పీలేరు ఎఫ్.పి.ఓ ద్వారా కిలోకు రూ.120/లభించింది. అంటే 400 కిలోలకు రూ.48,000/-
- కవర్ కట్టిన, కట్టని పండ్లకు స్థానిక మార్కెట్లో కిలోకు రూ.55 వంతున 750 కిలోలకు రూ. 41,250/-
- మొత్తం రాబడి (48,000+41,250): 89,250/-

ఈ సంవత్సరం 250 కిలోల ఉత్పత్తి పెరగడం, ఎఫ్. పి. ఓ ద్వారా మార్కెటింగ్ చేయడం వలన అదనంగా రూ. 44,250/- రాబడి వచ్చింది.

**ఎఫ్ పి ఓ చేసిన మేలు**

- కలెక్టివ్ ప్యాకింగ్ వల్ల ఖర్చు తగ్గింది
- డైరెక్ట్ మార్కెటింగ్ వల్ల రైతుకు అధిక ధర లభించింది.

ఈ రకంగా రైతుకు మేలు జరగడమే కాకుండా, ఎఫ్ పి ఓ కు కూడా మరింత అనుభవం, మంచిపేరు వచ్చింది.

**ఇక అన్ని పండ్లకు కవర్లు కడతా : మిథున్ రెడ్డి**

"గతంలో పండ్లను అమ్మకానికి తరలించేలోపే 15% వాడిపోయేవి, స్థానికంగా కవర్ కట్టిన, కట్టని పండ్లకు ఒకే ధర ఇచ్చేవారు. ఇప్పుడు ఫ్రూట్ కవర్ వేసి ముంబైకి నేరుగా పంపించగా 50% ఎక్కువ ధర వచ్చింది. ఎఫ్ పి ఓ వల్లే ఇది సాధ్యమైంది. వచ్చే సంవత్సరం మొత్తం పండ్లకు కవర్లు కట్టాలనుకుంటున్నాను." ■

## ఐ రా స పదవికి తెలుగు మహిళ నామినేషన్ !

**అం**తర్జాతీయ స్థాయిలో ఓ తెలుగు మహిళ అరుదైన గౌరవాన్ని అందుకున్నారు. ఐక్యరాజ్యసమితికి చెందిన ఇంటర్నేషనల్ టెలికమ్యూనికేషన్ యూనియన్ (ఐటీయూ) రేడియో కమ్యూనికేషన్ బ్యూరో డైరెక్టర్ పదవికి భారత అధికారిక అభ్యర్థిగా రేవతి మన్నెపల్లిని కేంద్ర ప్రభుత్వం నామినేట్ చేసింది. ఈమె స్వస్థలం ఆంధ్ర ప్రదేశ్‌లోని తిరుపతి జిల్లా సూళ్లూరుపేట కావడం విశేషం. ఈ పదవికి ఆమె ఎన్నికైతే, బ్యూరోకు నాయకత్వం వహించిన తొలి మహిళగా చరిత్ర సృష్టిస్తారు. "2027-30 కాలానికి వర్తించే ఈ పదవికి ఎన్నికలు 2026లో జరగనున్నాయి. ఈ విషయాన్ని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా అధికారికంగా ప్రకటించి, రేవతికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.



రేవతి మన్నెపల్లి తన స్వగ్రామంలో తొలి ఇంజినీర్‌గా నిలిచి, ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో కీలక పదవికి పోటీపడే స్థాయికి ఎదిగారు. హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూలో బీటెక్ పూర్తి చేసిన ఆమె, షార్‌లో ఇంజినీర్‌గా తన కెరీర్‌ను ప్రారంభించారు. ఏఎస్ఎల్‌వీ, పీఎస్ఎల్‌వీ ప్రయోగాల్లో కీలక పాత్ర పోషించారు. ఆ తర్వాత బార్క్‌లో శాస్త్రవేత్తగా కూడా సేవలందించారు.

గత కొన్నేళ్లుగా అంతర్జాతీయ స్థాయిలో టెలికాం రంగంలో రేవతి కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం ఆమె జెనీవాలోని ఇంటర్నేషనల్ రేడియో రెగ్యులేషన్ బోర్డులో సభ్యురాలిగా కొనసాగుతూ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్‌లో జాయింట్ వైర్‌లెస్ అడ్వైజర్‌గా భారత ప్రభుత్వానికి సలహాలు అందిస్తున్నారు. ■

# మహిళా ఉద్యోగుల కార్యాలయాల్లో చిన్నారుల సంరక్షణ కేంద్రాలు

**ఆం**ధ్రప్రదేశ్ ప్రభుత్వం మహిళా ఉద్యోగులకు శుభవార్త తెలిపింది. ఉద్యోగం చేసే మహిళలు పిల్లల ఆలనా పాలనా చూసుకోవడంలో ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి, పని ప్రదేశాల్లో క్రెష్‌లు (చిన్నారుల సంరక్షణ కేంద్రాలు) ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

మొదటి దశలో 216 ప్రాంతాల్లో క్రెష్‌లు ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. ఎక్కువ మంది మహిళా ఉద్యోగులు ఉన్న కార్యాలయాల్లో ఈ కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. ఈ నిర్ణయం మహిళా ఉద్యోగులకు ఎంతో ఊరటనిస్తుంది.



ప్రస్తుత కాలంలో పెరుగుతున్న ఖర్చులను దృష్టిలో పెట్టుకుని భార్యాభర్తలిద్దరూ తప్పక ఉద్యోగాలు చేయాల్సిన పరిస్థితి. అయితే ఉద్యోగ బాధ్యతలు నిర్వహణ విషయంలో పురుషులతో పోలిస్తే మహిళకు కొన్ని సవాళ్లు ఎదురవుతాయి. ఇంటి బాధ్యతలు చూసుకోవాలి. పిల్లల ఆలనాపాలనా వారి మీదనే ఉంటుంది. వీటన్నింటిని చూసుకుంటూనే ఉద్యోగం చేయాల్సి ఉంటుంది.

పిల్లలు కాస్త పెద్దవాళ్లు అయితే పర్లేదు కానీ.. నెలల పిల్లలు ఉన్న తల్లులకు ఉద్యోగ బాధ్యతలు నిర్వహించడం కత్తి మీద సాము లాంటిదే. ఇంట్లో పిల్లలను చూసుకునే వారు ఉంటే పర్లేదు.. లేదంటే ఉద్యోగం మానేయాల్సిన పరిస్థితి తలెత్తుంది. ఈ సమస్యను పరిష్కరించడం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.

మహిళలు ఇటు జాబ్.. అటు పిల్లల ఆలనాపాలనా చూసుకోవడంలో ఇబ్బంది పడుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పని ప్రదేశాల్లో క్రెష్‌లు (చిన్నారుల సంరక్షణ కేంద్రాలు) ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. మహిళా శిశు సంక్షేమ శాఖ దీనికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 216 ప్రాంతాలను గుర్తించి, అక్కడ క్రెష్‌లు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ప్రణాళికలు రెడీ చేస్తుంది. కేంద్ర సహకారం కోసం నివేదికను పంపింది.

ఎక్కువ మంది మహిళా ఉద్యోగులు ఉన్న చోట అంటే సుమారుగా 100మంది కంటే ఎక్కువ ఆడవారు పని చేస్తున్న చోట క్రెష్‌లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అలాంటి అన్ని కార్యాలయాల్లో వీటిని ఏర్పాటు చేస్తారు. అన్ని హెచ్ఓడీ కార్యాలయాలు, కలెక్టరేట్‌లు, జిల్లా కోర్టులు, గవర్నమెంట్ ఆసుపత్రులు, మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయాలు, జిల్లా పంచాయతీ కార్యాలయాలు, పుర పాలక ఆఫీసుల వద్ద క్రెష్‌లు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించారు. సాధ్యమైనంత వరకు ప్రభుత్వ భవనాల్లోనే ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. ఇందుకోసం అమరావతి సచివాలయంలో ఉన్న క్రెష్‌ను ఆదర్శంగా తీసుకుంటున్నారు. ఆరు నెలలు పైబడిన పిల్లలను ఈ క్రెష్‌లలో చూసుకుంటారు. పిల్లల సంరక్షణ కోసం ఒక కార్యకర్త, ఒక సహాయకురాలు ఉంటారు. ఆట వస్తువులు, ఊయల, బరువు చూసే యంత్రం, బెడ్లు, రిఫ్రిజిరేటర్, మరుగుదొడ్లు, ఫర్నిచర్ వంటి సౌకర్యాలు ఉంటాయి. తల్లిదండ్రులు తెచ్చిన ఆహారాన్నే పిల్లలకు తినిపిస్తారు. ■

### స్వయం సహాయ మహిళలకు వడ్డీలేని రుణాలు

**మ**హిళా స్వయం సహాయక సంఘాలకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రూ.344 కోట్ల వడ్డీ లేని రుణాలు విడుదల చేస్తూ నిర్ణయం తీసుకుంది.

ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ సెర్ప్‌కు నిధులు మంజూరు చేసింది. ఇందులో రూ. 300 కోట్లు గ్రామీణ మహిళ సంఘాలకు కేటాయించగా.. పట్టణ మహిళా సంఘాలకు రూ. 44 కోట్లు కేటాయించారు. ■

# నేల ఆరోగ్యం - ఉత్పాదకత పెంపుదల

ఆరోగ్యంగా ఉన్న నేలకు ప్రతికూల పరిస్థితులను తట్టుకునే బలం ఉంటుంది
నేల ఆరోగ్యంగా ఉండాలంటే, అందులో తగినంత సేంద్రియ పదార్థం ఉండాలి

## చేపట్టే పనులు



లోతుగా దుక్కులు దున్నడం



మల్చింగ్



పొలంలో పచ్చి రొట్ట ఎరువు సాగు



వైవిధ్య పంటల సాగు



చెరువు మట్టి చల్లడం



పంటలమార్పిడి



జీవ ఎరువుల వాడకం



నాణ్యమైన విత్తనాల వాడకం

NABARD

RNI Regd.No: TELTEL/2003/16365 MAHILA SADHIKARATHA Postal Regd No: HD/1064/2024-26
Publication Date:01-08-2025 Posting at BPC-1V Patrika Channel, Nampally, Hyderabad-500001 Posting Date: 05/06-08-2025

## ఏపిమాస్ 24 వ వార్షికోత్సవ సమావేశం : మరి కొన్ని దృశ్యాలు













పామిడి ఎఫ్ పి సి , రైతునేస్తం ఎఫ్ పి ఓ వార్షిక మహాసభల దృశ్యాలు





కుందుర్పి ఎఫ్ పి ఓ వార్షిక మహాసభ ... శ్రీ సిఎస్ రెడ్డి గోనెగండ్ల ఎఫ్ పి సి సందర్శన

To ADDRESS



శ్రీ సిఎస్ రెడ్డి ఎమ్మిగనూర్ ఎఫ్ పి ఓ సందర్శన

బట్వాడా కాకపోతే దయచేసి ఈ చిరునామాకు తిప్పిపంపండి

ఎడిటర్, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్, డ్రీమ్ వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089